BALA CHELIMI

BALA

JUN 2026

JUN



₹40

జూన్ - 2026

PRGI Regn. No. 52828/1992

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

**BALA CHELIMI**

**Telugu Children's Monthly Magazine**

సంపుటి : 35 • సంచిక : 9

JUNE - 2026



*Tiny feet, Grand traditions. One stage glowing with the colours of Pongal and the rhythm of childhood. Foundational Stage Grade 2 students performing on Annual Day Celebrations at Lalitha Kala Thoranam.*

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



## JUNE 2026

A celebration of culture, where dance carries stories from one generation to the next. Students performing the Lavani dance at the 45th Annual Day Celebrations of Oxford Grammar School, at Lalitha Kala Thoranam.


Oxford Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad
Ph : 040 2763 6214, +91 99590 20512
www.oxfordgrammarschool.com

ogs JUNIORS

45 YEARS OF MERITORIOUS PERFORMANCE


| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |
| | | | | | | |

**Important Dates**

21 June - International Yoga Day

26 June - Muharram

NOTES :


**Where others see obstacles, leaders see opportunities.**


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 9 | హైదరాబాద్ Hyderabad | జూన్ June | పేజీలు Pages 52 | రూ. ₹. 40











లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| చదువు ఆటలా సాగాలి..... | మణికొండ వేదకుమార్ .. | 5 |
| కాలగమనంలో చెరిగిపోని సంతకం గణిత శాస్త్రవేత్త ఆర్కిమిడిస్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| రక్త సంబంధం (ప్రపంచ రక్తదాతల దినోత్సవం) | డా. నీరజ అమరవాది | 7 |
| మాయమ్మ (పాట)... | గంగదేవు యాదయ్య | 8 |
| ఝుర్నాగార్డ్ | షీరోస్-256 | 9 |
| అక్షరాలతో ఆటలు - జంట అక్షరాలు (అక్షరం) | చొక్కాపు వెంకటరమణ | 10 |
| పర్యావరణం బాగుంటేనే (కథ) | మాచిరాజు కామేశ్వర రావు | 11 |
| పిల్లి - పులి (కవిత)... | రేడియమ్ | 12 |
| బొమ్మలేద్దామా... | కె. తేజస్విని, కె. నిశాంత్ | 12 |
| సమయస్ఫూర్తి (కథ) | జి. ఐశ్వర్య | 13 |
| జ్ఞాపకశక్తి ఆటలు (ఆట).. | చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు .... | 14 |
| బంగారు మర్రి - 13 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| పాలమూరు పిల్లలం (కవిత)... | గుర్రాల లక్ష్మారెడ్డి | 16 |
| సైబర్ మోసం (కథ) | డి. రవళి | 17 |
| సింహం - కుందేలు కథ | పంచతంత్ర కథ | 18 |
| తెలంగాణలో జైనం | దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి ...... | 19 |
| బాలనర్తకి (సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| పదాల మేడ (ఫజిల్) | మాదారపు వాణిశ్రీ | 20 |
| హలో హలో (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| 'జర్మన్ దేశపు మేరీ క్యూరీ' లిజీ మీట్నర్ (సైన్స్ వెన్నెల-20) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| ఈత చెట్టు (చెట్టు - చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| క్షమాగుణం (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| దేశానికి క్రీడాకారులను అందించిన నిశ్శబ్ద సేవకుడు "బల్దేవ్ సింగ్"కు పద్మశ్రీ పురస్కార గౌరవం (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| నిజం తెలుసుకున్న నిఖిల్ (కథ) | నారంశెట్టి ఉమామహేశ్వరరావు | 29 |
| వేమన పద్యాలు | | 30 |
| పన్నెండు నెలలు (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| తిక్క కుదిరింది (కథ) | చిలుకూరి హరి నందన | 33 |

వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకున్నట్టు (సామెతల కథలు - 4)... .......... బాల కథా సౌరభం ........................ 34
ఇక్ష్వాకుల సంస్కృతి (చరిత్ర పాఠాలు-16)........................................... డా. ద్యావనపల్లి సత్యనారాయణ .......... 35
నేర్చుకుందామా........................................................................ ..................................... 36
కలం-చెలిమి ........................................................................ ..................................... 36
హెల్మెట్ (కథ) ........................................................................ డి. స్నీతిక ................................ 37
సామెతలు ........................................................................ ..................................... 37
కోరుకున్న వరుస రెండు సంఖ్యలు (మాథ్స్ ట్రిక్స్) ................................... అంకెల మామయ్య చంద్రయ్య............. 38
చెలిమి క్లబ్........................................................................ బాలచెలిమి డెస్క్......................... 38
వేగం, సమర్థత, తెలివితేటలకు ప్రతీక - ఏఐ ఏజెంట్స్ (విద్య)......................... లత ........................................ 39
మా స్నేహం (కవిత)... ........................................................................ సిహెచ్. అక్షయ........................... 40
కోతులు - మిణుగురు పురుగులు (పిల్లల కథల్లో సైన్స్-5)......................... కె శ్రీకృష్ణ సాయి ........................... 41
పులిట్జర్ బహుమతులు-2026 (జి.కె.)........................................... బాలచెలిమి డెస్క్......................... 43
కళలకు ప్రోత్సాహమే సంస్కృతి అభివృద్ధికి మూలం" - బి. నర్సింగ్ రావు ............. బాలచెలిమి డెస్క్......................... 44
గోల్డ్ మెడల్ (కథ)... ........................................................................ బిక్కునూరి రాజేశ్వర్ ....................... 45
అడవుల అసలైన వారసులు బోర్నియో మహావానరాలు (నేచర్) ....................... సచిన్ కోత్వాల్ ............................ 46
తనదాకా వస్తే.... (కథ)... ........................................................................ బెహరా మోక్షజ ............................ 47
బాల చెలిమి గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక పఠనోత్సవం ............................ భైతి దుర్గయ్య, ఎల్. రామేశ్వర్ రెడ్డి........ 48
సమాచారం ........................................................................ బాలచెలిమి డెస్క్......................... 49
చెట్ల నీడలో చిరస్మరణీయుడైన వనజీవి రామయ్య (వ్యక్తిత్వం) .......................... సువేగా...................................... 50


# చెలిమి లేఖలు

బాలల హృదయాలకు ఆనందాన్ని పంచే "బాల చెలిమి" పత్రిక జ్ఞానం, నీతి, సృజనాత్మకతలకు చిరునామా. కథలు, పద్యాలు, పజిల్స్, ప్రశ్నలతో చిన్నారుల ఆలోచనలకు పదును పెడుతుంది. సంపాదకుడు మణికొండ వేద కుమార్ గారి ప్రేరణతో వెలుగొందుతున్న ఈ పత్రిక బాలల భవిష్యత్తుకు వెలుగుదారి చూపించే జ్ఞాన మిత్రం.

**- కే. గీతా దుర్గా శెట్టి,** (D/O. దామోదర్ శెట్టి)

తెలుగు బాలసాహిత్య రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్న "బాలచెలిమి" పత్రిక చిన్నారుల మేధో, భావోద్వేగ వికాసానికి అంకితమై కొనసాగుతోంది. విద్యతో పాటు వినోదాన్ని సమతుల్యం చేస్తూ పిల్లలలో సృజనాత్మక ఆలోచనలను ప్రేరేపిస్తోంది. కథలు, పద్యాలు, విజ్ఞాన విషయాలు, సాంస్కృతిక అంశాలతో ప్రతి సంచిక చిన్నారులకు జ్ఞానవేదికగా నిలుస్తోంది. సంపాదకుడు మణికొండ వేద కుమార్ గారి సాహిత్య సేవలు ఈ పత్రికకు విశ్వసనీయతను తీసుకువచ్చాయి.

**- రాజశేఖర్,** హైదరాబాద్.

'బాలల నవ్వుల్లో జ్ఞానపు వెలుగులు నింపే అక్షరాల తోట "బాలచెలిమి". ఊహాశక్తికి రెక్కలు తొడిగే కథలు, హృదయాన్ని హత్తుకునే పద్యాలు, తెలివితేటలను మేల్కొలిపే ప్రశ్నలు ఈ పత్రిక ప్రత్యేకత. పిల్లలలో చదివే అలవాటు పెంపొందిస్తూ, మంచి ఆలోచనలకు దారి చూపిస్తోంది. ప్రతి సంచిక చిన్నారులకు ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది.

**- విజయ,** కరీంనగర్

*Cover Picture :*
**DHATRIK SHANVIKA,**
Grade 2, Oxford Grammar School
Occasion : Celebration of Pongal
@ OGS 45th Annual Day 2026 Celebrations,
held at Lalitha Kala Thoranam.




బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728


**సంపాదకులు : మణికొండ వేదకుమార్**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St. No. 12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit. chelimi@gmail. com, www. balachelimi. com
Mob: 98480 44713

# చదువు ఆటలా సాగాలి

పిల్లలూ...

సెలవులు బాగా ఎంజాయ్ చేసారా. సెలవులు అయిపోతున్నాయి. మరో రెండు వారాల్లో స్కూళ్ళు తెరుస్తారు. మళ్ళీ చదువుల హడావిడి మొదలవుతుంది. స్కూలు సరంజామా అంతా రెడీ చేసుకోండి. మీ పాత బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్, షూస్ పేదపిల్లలకు యిచ్చి వారి చదువుకు సహకరించండి. స్కూలులో కొందరు పాత స్నేహితులు మిస్సవ్వచ్చు. కొత్త విద్యార్థులు చేరవచ్చు. కొత్త మిత్రులకు స్వాగతం చెప్పండి. స్నేహితులకు పరిచయం చేయండి. అందరూ కలిసి మెలసి స్నేహంగా, ప్రేమగా, దయగా వుండండి. కలసి ఆడుకోండి, పాడుకోండి, చదువుకోండి. కొత్త పాఠాలు చదవడానికి, నేర్చుకోవడానికి, అర్థం చేసుకోవడానికి సిద్ధంగా వుండండి.

మీరు సెలవుల్లో చూసిన ప్రదేశాలు, కలిసిన మిత్రులు, చదివిన పుస్తకాలు, మిమ్మల్ని ఆశ్చర్యపరచిన, ఆనందపరిచిన విషయాలను కథలుగా, కవితలుగా, యాత్రా కథనాలుగా, వ్యాసాలుగా రాసి బాలచెలిమికి పంపండి. మీ అనుభూతులనూ, ఆనందాలనూ బాలచెలిమి ద్వారా యితరులతో పంచుకోండి.


బాలచెలిమి గ్రంథాలయాలను విద్యార్థులు బాగా వినియోగించుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది. గ్రంథాలయాల ప్రేరణతో, శిక్షణతో మీరు కథలు రాయడం, అవి బాలచెలిమిలో అచ్చవడం మరింత ఆనందంగా వుంది. బాలచెలిమి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి. మీ పఠనాసక్తిని పెంచి, మీ రచనా నైపుణ్యాలకు మెరుగులు పరచాలన్నదే బాలచెలిమి ధ్యేయం.

పిల్లలూ... బాలచెలిమి పత్రికను పూర్తిగా చదువుతున్నారు కదా! ఇందులో మీకు నచ్చిన శీర్షికలు, కథలు గురించి పత్రికకు లేఖలు రాయండి.

నేర్చుకుంటున్నామనే విషయం తెలియకుండానే మీరు అనేక విషయాలు నేర్చుకుంటారు. ఆటల్లో, పాటల్లో మీరు చాలా నేర్చుకుంటారు. చదువు కూడా ఆటలా సాగాలి. ఇలా చదువుకున్న చదువు మీ మెదడులో బలంగా ఎప్పుడూ వుండిపోతుంది. అయితే అక్షరాలు, పదాలు, వాక్యాలు నేర్చుకోవడానికి, నైపుణ్యం సంపాదించడానికి కొంత ప్రయత్నం చేయాలి.

తరగతి గదిలో పాఠ్య పుస్తకం, బ్లాక్‌బోర్డు, ఉపాధ్యాయుడు మాత్రమే ఉంటారు. ఈ ప్రపంచం ఒక ప్రదర్శనశాల. ఇందులో లేనివేవీ లేవు. ఈ ప్రదర్శనశాలలో ఏమి వుంటాయో, ఎలా చూడాలో, ఎందుకు చూడాలో వివరించి చెప్పే గైడ్స్ మీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు. ఈ ప్రదర్శన శాలను అర్థం చేసుకోవడానికి బాలచెలిమి గ్రంథాలయాలు పునాదిగా, ప్రేరణగా నిలుస్తాయి.

చదువంటే తెలుసుకోవడం అనే విషయాన్ని తెలియజేస్తాయి.



మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)


ఎడిటర్ బాలచెలిమి



# కాలగమనంలో చెరిగిపోని సంతకం గణిత శాస్త్రవేత్త
# ఆర్కిమిడిస్

ఆర్కిమిడిస్ ప్రాచీన గ్రీకు శాస్త్రజ్ఞుడు. భౌతిక శాస్త్రవేత్త. ఆవిష్కర్త. ఆర్కిమిడిస్ క్రీ.పూ. 287లో సిసిలీలోని ఓడరేవు పట్టణమైన సిరక్యూస్‌లో జన్మించాడు. 75 సం॥రాలు జీవించాడు. తన తండ్రి ఫిడియస్ ఒక ఖగోళ శాస్త్రవేత్త. సిరక్యూస్ రాజుకు బంధువు. ఆర్కిమిడిస్ జీవిత చరిత్రను అతని స్నేహితుడు పెరాక్లైడిస్ రాసాడు. రాత ప్రతి పాడైపోవడంతో జీవిత విశేషాలు స్పష్టంగా తెలియడం లేదు.

ఏ వస్తువైనా నీటిలో ముంచినప్పుడు ఆ వస్తువు తన ఘనపరిణామానికి సమానమైన నీటిని వైదొలిగిస్తుందని తెలుసుకున్నాడు. ద్రవాలలో ఒక వస్తువు కోల్పోయిన భారం అది తొలగించిన ద్రవం యొక్క భారానికి సమానం అని తెలియజేసే అతని సూత్రం ఆర్కిమిడిస్ సూత్రంగా ప్రసిద్ధి చెందింది. ఆర్కిమిడిస్ ప్లవన సూత్రాలను నిర్దేశించాడు.



గణితశాస్త్రం దాని రహస్యాలను దానిని అందంగా ప్రేమించేవారికి మాత్రమే వెల్లడిస్తుంది. శాస్త్రీయ పురాతన కాలంలోని ప్రముఖ శాస్త్రవేత్తలలో ఒకరిగా గణుతికెక్కారు. అతను పై $\Pi$ విలువను కచ్చితంగా లెక్కించాడు. వృత్త పరిధి చుట్టుకొలతలను నిర్ణయించేందుకు సూత్రాలను కనిపెట్టాడు. కప్పీలను రూపొందించి వాటి ఆధారంతో ఎక్కువ బరువున్న వస్తువులను సునాయాసంగా లాగవచ్చని తెలియజేసాడు. మేథమెటిక్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్, ఆస్ట్రానమీ ఇన్‌వెన్షన్ వంటి రంగాలలో కృషి చేసారు. ఆర్కిమిడిస్ సూత్రాలు (ప్రిన్సిపల్స్, ఆర్కిమిడిస్ స్క్రూ (హెడ్), స్టాటిక్స్‌లలో ప్రసిద్ధుడయ్యాడు. ఆర్కిమిడిస్ ఆవిష్కరణలలో ముఖ్యమైనవి తన దేశం సిరక్యూస్‌ను రక్షించుకోవడానికి రూపొందించిన యుద్ధతంత్రాలే. నిలువెత్తు అద్దాలతో సూర్యుని వేడి కిరణాలను రోమన్ నౌకల మీదకి పరావర్తనం ద్వారా పంపించి ఆ నౌకలను అస్తవ్యస్థం చేసాడని ప్రచారంలో వుంది.

ఇంజనీరింగ్ రంగంలో కూడా ఆర్కిమిడిస్ చేసిన కృషిలో ఎక్కువ భాగం తన సొంత నగరమైన సిరక్యూస్ అవసరాలను తీర్చడం కోసం చేసిందే. రాజు గారి కోరిక మేరకు 600 గదులున్న పెద్ద ఓడను చేసాడట. ఓడలోకి చేరే నీటిని బయటకు పంపడానికి ఒక పరికరాన్ని తయారు చేసాడు. ఇది స్థూపాకారంలో వుంటుంది. దిగువ ప్రాంతాలలోని కాలువల నుండి నీటిని ఎగువ ప్రాంతాలలోని పొలాలకు పంపించడానికి దీనిని ఉపయోగించవచ్చు. ప్రస్తుతం బొగ్గు, ధాన్యం వంటి ఘనపదార్థాలను, కొన్ని ద్రవాలను తరలించడానికి ఉపయోగిస్తున్నారు.

ప్రపంచంలో మొట్టమొదటిసారి సముద్రంలో ప్రయోగించే స్క్రూ ప్రొపెల్లర్‌తో పని చేసే స్టీమ్ షిప్ ఎస్.ఎస్. ఆర్కిమిడిస్ 1898లో ప్రారంభించబడింది.

ఆన్ ది స్పియర్ అండ్ సిలిండర్, మెజర్‌మెంట్ ఆఫ్ ది సర్కిల్, ఆన్ ఫ్లోటింగ్ బాడీస్, అన్‌బ్యాలెన్స్‌డ్ అండ్ లీవర్స్ వంటి అతని పుస్తకాలు ప్రత్యేక గుర్తింపు పొందాయి.

క్రీ.పూ. 212లో సిరక్యూస్‌ను రోమన్‌లు ఆక్రమించారు. ఆర్కిమిడిస్ వృత్తాల మీద తన పరిశోధనలు మానలేదు. ఆ పనిలో అతను నిమగ్నమై వుండగా రోమన్ సైనికులు అతని ఇంటిని ఆక్రమించి అతనిని చంపేసారు. క్రీ.పూ. 75లో సిసిరో ఆర్కిమిడిస్ సమాధిని సందర్శించాడు. అతని సమాధి మీద గోళం – స్థూపం చిత్రాలు వున్నట్లు గుర్తించాడు. 'యురేకా యురేకా' కథనం కథానాయకుడు ఆర్కిమిడిస్. కాలగమనంలో స్థిరస్థానం ఆర్కిమిడిస్.

– జుగాష్‌విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998




# రక్త సంబంధం

పిల్లలూ మీరందరు పై తరగతులకి వచ్చారా. సంతోషం. వేసవిలో దొరికే మామిడి పళ్లు తిన్నారా. వాటిలో కూడా ఎన్నో రకాలు ఉన్నాయని తెలుసుకున్నారా! సరే ఇప్పుడు మీకు ఒక ప్రశ్న? మీకు ఇష్టమైన రంగు పేరు చెప్పండి. ఎరుపు రంగంటే ఇష్టమా.. నాక్కూడా ఎరుపు రంగే ఇష్టం. ఎరుపు రంగులో ఉండే వస్తువుల పేర్లు చెప్పండి. ఆపిల్, టమాటా, చెర్రీ. ఇంకా.. మన శరీరంలో ప్రవహించే రక్తం కూడా ఎరుపు రంగులోనే ఉంటుంది. మనుషుల రంగు వేరుగా ఉన్నా అందరి రక్తం ఎరుపు రంగులోనే ఉంటుంది. అందరి రక్తం ఎర్రగా ఉన్నా అందులో కూడా గ్రూపులు ఉంటాయి. ముఖ్యంగా ఏ, బీ, ఓ అనే గ్రూపులు ఉంటాయి.

1901లో ఆస్ట్రేలియాకు చెందిన 'లాండ్ స్టీనర్' అనే శాస్త్రవేత్త మొదటిసారి రక్తాన్ని వర్గీకరించారు. దీన్ని వైద్యరంగంలో ఒక మైలురాయిగా పరిగణించవచ్చు. మానవ జీవక్రియలో రక్తం ముఖ్య భూమికను పోషిస్తుంది. రక్తాన్ని కృత్రిమంగా తయారుచేయలేము. రక్తదానం చేస్తే ఎంతో మందికి ప్రాణదానం చేసినట్లే. రక్తదానాన్ని కూడా ఒక సామాజిక బాధ్యతగా భావించాలి.

"Blood donation; the most precious gift you can give".

2004వ సంవత్సరం నుండి 'లాండ్ స్టీనర్' జయంతికి గుర్తుగా జూన్ 14వ తేదీని WHO ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని(World blood doner day) జరుపుతోంది. ఈ రక్తదాతల దినోత్సవం యొక్క ఆవశ్యకతను, ప్రాముఖ్యతను తెలుసుకుందాం. ప్రపంచంలో రోజూ ఎంతో మందికి రకరకాల కారణాల వల్ల రక్తం అవసరమౌతోంది. వారిలో ముఖ్యంగా చెప్పకోతగ్గవారు తలసీమియా వ్యాధి గ్రస్తులు, ప్రమాదాలలో రక్తం కోల్పోయిన వారు, కాన్సర్ బాధితులు, ప్రసవ సమయంలో, కొన్ని శస్త్ర చికిత్సల సమయంలో రక్తం ఎక్కించాల్సి వస్తుంది. రక్తంలోని గ్రూపులను కనుక్కోక ముందు ఒకరికి రక్తం ఎక్కిస్తే వికటిస్తే, అదే మరోకరికి సానుకూలంగా ఎందుకు పనిచేసేదో ఎవరికీ అంతుచిక్కని ప్రశ్నలా ఉండేది. ఒకరి రక్తాన్ని మరొకరికి ఇవ్వడమే రక్తదానం. రక్తాన్ని ఇచ్చే వ్యక్తిని రక్త దాత అని, రక్తాన్ని తీసుకునే వారిని రక్త గ్రహీత అని అంటారు. ఓ గ్రూప్‌ని విశ్వదాత అని, ఏ, బీ గ్రూపులను విశ్వ గ్రహీత అంటారు.

ఆరోగ్యంగా ఉన్న18 ఏళ్ల వయసు నుండి 65 ఏళ్ల వారందరు రక్తదానానికి అర్హులు. ఒక సారి రక్తం ఇచ్చిన, మూడు నెలల తరువాత మళ్లీ ఇవ్వవచ్చు. పేద, ధనిక తేడా లేకుండా అందరూ ప్రాణాలను కాపాడవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా రక్తం అవసరాలకు తగ్గట్లుగా సరఫరా లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారు. అందుకే ప్రజలకు రక్తదానం పట్ల అవగాహన, రక్తదాన ఆవశ్యకత పై సమాచారాన్ని అందించడమే ప్రపంచ రక్తదాన


దినోత్సవ లక్ష్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు, వివిధ దేశాలలో ఉన్న డాక్టర్లు, ఆరోగ్య మంత్రిత్వ శాఖతో పాటు, రక్త నిధి సంస్థలు, జాతీయ ఆరోగ్య మండలి, ఇతర లాభాపేక్ష లేని సంస్థలు అన్నీ కలిసి ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగానే జాతీయ రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ, నలుగురికీ రక్తదానం గురించి అవగాహనను పెంచుతారు. దాతలను గౌరవిస్తారు. రక్తదానం అవసరమయ్యే రోగుల గురించి చెబుతూ, ఉచితంగా రక్తదానం చేసేట్లుగా ప్రోత్సహిస్తారు. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌తో ఈ కార్యక్రమాలని నిర్వహిస్తారు.

2026 థీమ్ 'స్వచ్ఛంద రక్తదానాన్ని ప్రోత్సహించడం' (Normalizing Voluntary Blood Donation). రక్త దానం ఎదుటి వారిని రక్షించడానికే కాదు. దానితో మనలోని ఒత్తిడి, నెగిటివ్ ఫీలింగ్స్ ని కూడా తగ్గించుకోవచ్చుట. పిల్లలూ మీరు 18 ఏళ్లు నిండిన తరువాత రక్తదానం చేయవచ్చు. అప్పటి వరకు రక్తదాన ఆవశ్యకతను తెలియజేసే వాలంటీర్ గా ఉండండి. చుట్టు పక్కలవారితో రక్తదానం గురించిన సమాచారాన్ని పంచుకోండి. అవసరమైన వారికి సాయపడండి.

– డా. నీరజ అమరవాది
m : 9849160055

పాట

# మాయమ్మ



ఉయ్యాల ఊపినాది... మాయమ్మ
ఉగ్గుపాలు తాపినాది... మాయమ్మ
జోల పాట పాడినాది... మాయమ్మ
జోగు నన్ను పుచ్చినాది... మాయమ్మ
తాను పనికి వెళ్ళినాది... మాయమ్మ
తల్లడిల్లి పోయినాది... మాయమ్మ

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

చందదారులుగా చేరండి!

బాల చెలిమి

చందదారులను చేర్పించండి!

'యం. వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వాహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

SCAN & PAY

**మా చిరునామా :**

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2,
St. No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk. chelimi@gmail. com,
www. balachelimi. com

**చందా వివరాలు :**

| | |
|---|---|
| విడి ప్రతి | : రూ. 40 |
| వార్షిక చందా | : రూ. 400 |
| 2 సం॥లకు | : రూ. 750 |

'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.


**ACCOUNT DETAILS :**

| | |
|---|---|
| Bank Name | : Canara Bank |
| A/C No. | : 30101010003714 |
| Branch | : Ashoknagar, HYDERABAD. |
| IFSC Code | : CNRB0013010 |

# ఝర్నా గార్గ్

## హాస్యం, ధైర్యాల కలయిక

స్ఫూర్తిదాయక భారతీయ అమెరికన్ స్టాండప్ కమెడియన్‌గా, సినీ రచయితగా, హాస్యాన్ని పంచే, ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిగా ఝర్నా గార్గ్ (1975 ఫిబ్రవరి 15 –) ప్రసిద్ధి చెందారు. అమెరికన్ న్యూస్ ఛానెల్ సీఎన్బీసీ ఆమెను 'ముక్కుసూటిగా మాట్లాడే విదూషకురాలిగా, ఇండియన్ అమెరికన్ మహిళా స్వరం'గా అభివర్ణించింది.




ఆమె భారత దేశంలో పుట్టారు. తల్లి చనిపోవడం, పెద్దలు కుదిర్చిన పెళ్లి చేసుకోవాలని తండ్రి ఒత్తిడి చేయడం వంటి అనేక సవాళ్లు ఎదుర్కొన్నారు. సంప్రదాయాన్ని అనుసరించే బదులు, తాను కోరుకున్న మార్గాన్ని ఆమె ఎంచుకున్నారు. అమెరికా వెళ్లి అక్రోన్ విశ్వవిద్యాలయం నుంచి ఫైనాన్స్ డిగ్రీ, కేస్ వెస్ట్రన్ రిజర్వ్ విశ్వవిద్యాలయం నుంచి న్యాయ పట్టా పొందారు. చాలా సంవత్సరాల పాటు ఇంటికే పరిమితమైన తల్లిగా ఉండి, పిల్లల ప్రోత్సాహంతో స్టాండ్-అప్ కామెడీ గురించి తెలుసుకున్నారు.

ఆమె హాస్య ప్రయాణం 2018లో న్యూయార్క్ నగరంలో ప్రారంభమైంది. ఆ తరవాత ఆమె స్టాండ్- అప్ కామెడీకి ప్రసిద్ధ వేదిక అయిన బ్రాడ్వే, కేరలైన్స్‌లో ప్రదర్శన ఇచ్చారు. 'రీఅరేంజ్డ్' అనే రొమాంటిక్ – కామెడీకి ఝర్నా రాసిన స్క్రీన్‌ప్లే ఆస్టిన్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రశంస, నికోల్ ఫెలోషిప్‌లను అందించింది. ఝర్నా ధైర్యం, నిర్భయ స్ఫూర్తికి 'టాప్మాన్ హాల్,' 'టుడే,' 'దిస్ అమెరికన్ లైఫ్' వంటి వేదికల మీద ప్రశంసలు లభించాయి. 2023లో ఆమె నేషనల్ ఉమెన్స్ హిస్టరీ మ్యూజియం వారి ఉమెన్ మేకింగ్ హిస్టరీ అవార్డ్ కార్యక్రమం నిర్వహించారు.

కలలు నిజం చేసుకోవడానికి, ఎంచుకున్న రంగంలో ముందడుగు వేయడానికి వయసుతో నిమిత్తం లేదని ఆమె కథనం మనకు గుర్తు చేస్తుంది.

– 'షీరోస్-256
ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....

**మీకు తెలుసా?**

'ఝర్నా గార్గ్: ఒన్ ఇన్ ఏ బిలియన్,' అనే ప్రత్యేక కామెడీ కార్యక్రమం 2023 మే నెలలో అమెజాన్ ప్రైమ్ వీడియోలో ప్రసారమైంది.

# అక్షరాలతో ఆటలు



## జంట అక్షరాలు

ఒకే రకం జంట అక్షరాలు. అవి దీర్ఘాలు అయితే ఇంకా బాగుంటాయి

| | | |
|---|---|---|
| కాకా | లేలే | ఖోఖో |
| చాచా | కూకూ | జేజే |
| జోజో | ఛీఛీ | తూతూ |
| దాదా | తాతా | నేనే |
| పాపా | నానా | బాబా |
| బోబో | ఫోఫో | మామా |
| మీమీ | భౌభౌ | రారా |
| | మేమే | హీహీ |
| | హోహో | |



– చొక్కాపు వెంకటరమణ
రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
(తానా 'తెలుగు తేజం' పుస్తకం నుండి...)
m: 92465 20050



కథ

# పర్యావరణం బాగుంటేనే

ములుగు ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న రవికి చిన్నతనం నుంచి ప్రకృతి అంటే అమితమైన ప్రేమ, ఆసక్తి.

ఒక రోజు వాడు కొండ ప్రాంతంలో తిరుగుతూ వుండగా అనుకోకుండా వర్షం వచ్చి, ఆ పక్కనే ఉన్న గుహ లోకి వెళ్ళాడు. ఆశ్చర్యంగా ఆ గుహలో మూడు పాత కాలపు పెట్టెలు వున్నాయి. ఒక పెట్టె మీద 'వృక్షం' అని, మరొక పెట్టె మీద 'గాలి' అని, వేరొక పెట్టె మీద 'నీరు' అని వ్రాసి వుంది.




రవి ఆసక్తిగా 'వృక్షం' అని వ్రాసి వున్న పెట్టె మూత తెరిచి చూసాడు. మూతకు లోపలి వైపు బిగించి వున్న అద్దంలో వాడికి అడవి దృశ్యం కనిపించింది. ఆ అడవిలో అనేక చెట్లు నరికి వేయబడి వున్నాయి. ఒక పక్క అడవి తగలబడి పోతోంది. హాహాకారాలు చేస్తూ జంతువులు అటూ ఇటూ పరుగులు తీస్తున్నాయి. ఎక్కడా పచ్చదనం అనేది లేకుండా అడవి అంతా ఎండి పోయి నిర్జీవంగా ఉంది. ఎక్కువ సేపు ఆ భయంకర దృశ్యం చూడలేక చప్పున పెట్టె ను మూసేసాడు రవి.

ఈ సారి రవి 'గాలి' అని వ్రాసి వున్న పెట్టె మూత తీసి చూసాడు. లోపలి అద్దం లో నల్లటి పొగతో నిండిన నీలాకాశం కనబడింది. ఎటు చూస్తే అటు కర్మాగారాల నుంచి విడుదల అయ్యే విష వాయువులు, చెత్త తగల బెట్టిన పొగలు, వాహనాలనుంచి వచ్చే పొగలు! ఆ విషపు గాలులకు మనుషుల తో పాటు పశు పక్షాదులు కూడా ఉక్కిరి బిక్కిరి అయి, రోగాల బారిన పడుతున్నాయి. మనుషులు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకుని తిరుగుతున్నారు. ఇక చూడలేక ఆ పెట్టె తలుపు మూసేసాడు రవి.

ఆఖరుగా "నీరు" అని వ్రాసి వున్న పెట్టె మూత తెరిచి చూసాడు రవి. అద్దంలో స్వచ్ఛమైన వర్షపు నీరు మురికి కాలువలో కలుస్తున్నదృశ్యం కనిపిస్తోంది.. చాలా ఇళ్ళలో కుళాయిలు విప్పి వుండటంతో నీరు వృధాగా పోతోంది. నదులు చెత్తతోనూ, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి పోయి వున్నాయి. నది నిండా చచ్చిన చేపలు తేలుతూ కనిపిస్తున్నాయి. తాగడానికి నీళ్ళు లేక మరణించిన అనేక పక్షుల, జంతువుల మృత దేహాలు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయి.

ఆ పెట్టె తలుపు కూడా మూసేయ బోతూ వుండగా, "ఇక లేవరా బాబూ! ఎంత సెలవు రోజు అయితే మాత్రం ఎనిమిదింటి దాకా పడుకోవాలా?" అంటూ రవిని తట్టి లేపు తోంది వాళ్ళ అమ్మ.

ఉలిక్కి పడి కళ్ళు తెరిచాడు రవి. తను గుహలోకి వెళ్ళడం, వింత పెట్టెలను చూడటం అంతా ఒక కల అన్న మాట!

వెంటనే వాడు తల్లిని పక్కన కూర్చో బెట్టుకుని తను

కన్న కలను గురించి వివరంగా చెప్పి, "నా కల చాలా గమ్మత్తుగా వుంది కదా అమ్మా!" అన్నాడు.

అమ్మ నవ్వి, "నువ్వు ప్రకృతి ప్రేమికుడివి కదా, అందుకే ప్రకృతి తన బాధలు నీకు చెప్పుకుంది!" అంది.

"అయితే ఇప్పుడు ప్రకృతి బావుండాలంటే నన్నేం చేయమంటావు?" అని అడిగాడు రవి.

"ఇప్పుడు కూడా నువ్వు నీ వయసుకు తగినట్లుగా కొన్ని పనులు చేయవచ్చు. విరివిగా మొక్కలు నాటు! నీరు పొదుపుగా వాడు. నాన్నకు చెప్పి వర్షం నీరు వృధాగా పోకుండా ఇంకుడు గుంతలు తవ్వించు. పొడి చెత్త, తడి చెత్త వేరు చేయడంలో నాకు సహాయ పడు! పక్షులకు నూకలు వేయి. వాటి కోసం పాత్రలలో నీరు బయట పెట్టు. దుకాణం వాళ్ళు ఇచ్చినా ప్లాస్టిక్ కవర్లు, సంచులు తీసుకోకు! ఏం కొనాలని అన్నా ఇంటి నుంచి గుడ్డ సంచీ తీసుకెళ్ళు! నాన్నని ఆఫీస్‌కి కారులో కాకుండా సైకిల్ మీద వెళ్ళమని చెబుదాం. ఇలా తలుచుకుంటే మనం ఈ పర్యావరణాన్ని కాపాడు కోవడానికి ఎన్నో మంచి పనులు చేయ వచ్చు! పర్యావరణం బాగుంటేనే మనం కూడా బావుంటాము!" అంది అమ్మ.

"అలాగే అమ్మా! నువ్వు చెప్పిన విధంగా నేను ఈ రోజు నుంచే మన పరిసరాలు శుభ్రంగా వుంచుకునే పనులు, ప్రకృతి ఆనంద పడే పనులు చేస్తాను!" అన్నాడు రవి ఉత్సాహంగా.

"నువ్వే కాదు, మీ పాఠశాల పిల్లల అందరి చేతా ఇటువంటి మంచి పనులు చేయించాలి!" అంది అమ్మ నవ్వుతూ.

– మాచిరాజు కామేశ్వర రావు
m : 9000080396

# పిల్లీ పులి




పిల్లి పిల్లి పిల్లి
ఎలుకలు పట్టె పిల్లి
ఇల్లు ఇల్లు తిరిగి
పాలు తాగె పిల్లి



చాటునుండి
మాటు వేసి
వేటను నోటను కరచి
రెప్పపాటున
గోడను దూకె పిల్లి



తెల్లని పిల్లి
నల్లని పిల్లి
పెంపుడు పిల్లి
అల్లరి పిల్లి



మ్యావ్ అంటే ఎలుక పరుగు
భౌ భౌ వింటే పిల్లి పరుగు
ఎలుకలకది పులి
కుక్కలంటే గిలి

– రేడియమ్
m: 9291527757


# బొమ్మలేద్దామా...




కె. తేజస్విని,
8వ తరగతి, జెడ్పిహెచ్ఎస్ అవునూరు, ముస్తాబాద్, రాజన్న సిరిసిల్లా




కె. నిశాంత్,
8వ తరగతి, జెడ్పిహెచ్ఎస్ అవునూరు, ముస్తాబాద్, రాజన్న సిరిసిల్లా



# సమయస్ఫూర్తి

అనగనగా ఒక ఊరిలో రాము, రాఘువ అనే అన్నాదమ్ముళ్ళు ఉండేవారు. వారికి అమ్మనాన్న చిన్నప్పుడే చనిపోయారు. వారు ఒకరికి ఒకరు ప్రేమగా ఉండేవారు. ఒకరోజు రాఘువ కట్టెలు కొట్టుకొస్తాను అని అన్న రాముకి చెప్పి వెళ్ళాడు. రాఘువ చెట్లు కొడుతుంటే ముగ్గురు దొంగలు వచ్చి రాఘువని ఎత్తుకుపోయారు.

రాఘువ వాళ్ల అన్నయ్య రాము తమ్ముడు ఇంకా రాలేదు అని అడవికి వెళ్లాడు. ఒక చిన్న ఇల్లు రాముకి కనబడింది. అక్కడికి వెళ్లాడు. రాము అక్కడ తమ్ముని్న ముగ్గురు దొంగలు కట్టివేయడం చూశాడు. రామును విడిచి పెట్టమని ఆ ముగ్గురు దొంగలను బతిమాలాడు.

అప్పుడు ఆ ముగ్గురు దొంగలు "మాకు బంగారం తెచ్చిస్తేనే వదిలి పెడతాము" అన్నారు. అప్పుడు రాము లోపలికి వచ్చి "నేను బంగారం ఇస్తాను" అని అన్నాడు. రాము నాతోపాటు ఇద్దరు రండి అన్నాడు వాళ్ళు సరేనని రాము వెంబడి వెళ్లారు రాఘువ దొంగని నీళ్ళు అడిగాడు. ఆ దొంగ నీళ్లు తెచ్చాడు. ఆ దొంగ తెలివి తక్కువ వాడు. అది రాఘువ అర్థం చేసుకున్నాడు.

రాఘువ "నేను నీళ్లు ఎలా తాగాలి" అని ఆ దొంగను అడిగాడు. అప్పుడు అతను "చేతులతో తాగాలి" అన్నాడు. అప్పుడు రాఘువ "నా చేతులు కట్టేసారు, నేను నీళ్లు ఎలా తాగాలి" అంటే ఆ దొంగ చేతులు విప్పేసాడు. ఆ దొంగకు నిద్ర వచ్చి పడుకున్నాడు. రాఘువ మెల్లగా తప్పించుకొని ఇంటికి వచ్చాడు. రాము ఆ ఇద్దరు దొంగలని కొట్టి పోలీసులకు అప్పగించాడు. తమ తెలివి తేటల వల్ల అన్నదమ్ములు ప్రాణాలను కాపాడుకున్నారు.

–జి. ఐశ్వర్య
8వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, జీనుగురాల, దేవరకద్ర

# జ్ఞాపకశక్తి ఆటలు



కావలసిన వస్తువులు:









... మరెన్నో



ఎంత మంది పాల్గొనవచ్చు -
**ఆరుగురు లేదా అంతకు మించి**
ఎక్కడ ఆడవచ్చు -
**ఇంట్లో లేదా ఆరుబయట**
ఈ ఆటకు గల ఇతర పేర్లు -
**ఎవరికెన్ని గుర్తు?, జ్ఞాపకశక్తి పోటీలు**

'జ్ఞాపక శక్తి ఆట'లో పాల్గొనే పిల్లలందరూ తెల్ల కాగితం మరియు పెన్ను తీసుకుని ఒక వరుసలో నిలబడాలి. వారి వెనుక వైపు ఒక టేబుల్ పైన ప్లేటులో 24 రకాల వస్తువులు ఉంచాలి. స్పూను, పెన్ను, బంతి, పిన్నీసు, క్యాండిల్, గడియారం మొదలైనవి. పిల్లలందరినీ పిలిచి ఆ వస్తువులన్నీ ముప్పై సెకండ్ల పాటు చూడమని చెప్పాలి. ఆ తరువాత వాళ్ళందరూ వారి వారి స్థానాల్లో నిలబడి ప్లేటులో ఉన్న వస్తువులను గుర్తుకు తెచ్చుకుని పేపరు పైన రాయాలి. ఎవరు ఎక్కువ వస్తువులు గుర్తు పెట్టుకుని రాస్తారో వారు గెలిచినట్టు.

ఇదే ఆటను రెండు జట్లుగా ఏర్పడి కూడా ఆడవచ్చు. ప్లేటులో ఉంచిన వస్తువులను రెండు జట్లను ముప్పై సెకండ్లపాటు చూసి వారి వారి స్థానాల్లోకి వెళ్లి వస్తువుల పేర్లు రాయమని చెప్పాలి. ఏ జట్టు ఎక్కువ వస్తువుల పేర్లు రాస్తుందో, ఆ జట్టు గెలిచినట్టు.

ప్రయోజనం:

ఈ ఆట ఆడటం ద్వారా పిల్లల జ్ఞాపకశక్తి అధికమవుతుంది.

- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...

✦ సీరియల్-13

# బంగారు మర్రి

**(బాలలకోసం ఆధునిక సాహస నవల)**




(గత సంచిక తరువాయి...)

'ఆదిభట్ల నుంచి నాదర్‌గుల్ వెళ్లే రోడ్డు. వీధిలైట్లు కొంతవరకే ఉన్నాయియి. అవి కూడా కొన్ని వర్షాలకు పాడై మినుకు, మినుకుమని వెలుగుతున్నాయి. బస్సులు తిరిగే రోడ్డు, కాలేజీలు, పాఠశాలలు, కంపెనీలు ఉన్న రోడ్డు. ఎయిర్ పోర్ట్‌కు వెళ్లే కార్లు తిరిగే రోడ్డు. ఐనా ఎంతో కాలంగా రోడ్డు పగిలి అక్కడక్కడా గుంటలు, కంకర తేలాయి. వాటిని తాత్కాలికంగానైనా రిపేరు చేయకుండా వదిలేసారు. అందుకే టూ వీలర్ మీద వెళ్లే వారు నెమ్మదిగానే వెళతారు. టాటా ఎరోస్పేస్‌లో డ్యూటీ ముగించుకుని నాదర్‌గుల్ మీదుగా ఇంటికి వెళుతున్న ఉద్యోగి ఉన్నట్టుండి బండి ఆపాడు. వీధిలైటు మినుకు, మినుకు మంటూంది. రోడ్డుకు పక్కగా ఒక పెద్ద ఆకారం పడుకోని ఉండటం గమనించాడు. బండికి ఉన్న లైటు ఆ ఆకారం వైపు తిప్పాడు. అంతే.. వెన్నులో దడ పుట్టింది. భయంగా "పులి! పులి!! పులి!!" అని అరుస్తూ వెనక్కి తిరిగి కంపెనీకి పోనిచ్చాడు. పులి కనిపించిన విషయం సెక్యూరిటీ ఆఫీసర్‌కు చెప్పాడు. అతను వెంటనే ఉద్యోగులను బయటకు పంపకుండా అప్రమత్తం చేశాడు. స్థానిక పోలీసులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు.

నాదర్‌గుల్ రోడ్లమీద టాటా ఏరో స్పేస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, టి.సి.ఎస్ ఉద్యోగులు షిఫ్ట్ ప్రకారం విధులు నిర్వహిస్తుంటారు. పులి ఎప్పుడు ఎటు నుంచి, ఎవరి మీద పంజా విసురుతుందో తెలీదు. పోలీసు, అటవీ శాఖ అధికారులు నాదర్ గుల్ చేరుకున్నారు. వారి వెంట మీడియా కూడా తిరుగుతూంది.

ఎరోస్పేస్ ఉద్యోగి చెప్పిన స్థలంలో పులి కనిపించలేదు. పది సెన్సార్ కెమేరాలు, ఐదు ప్రత్యేక నిఘా బృందాలు, రెండు వైద్య బృందాలు నాదర్ గుల్‌ని చుట్టు ముట్టాయి. నాదర్ గుల్ నుంచి ఆదిభట్ల వరకు అక్క డక్కడా సెన్సార్ కెమేరాలు పెట్టారు. రెండు బోనుల్లో గొర్రె పోతులను ఎరగా పెట్టారు. డాక్టర్లు మత్తు బుల్లెట్లు సిద్ధం చేశారు.

చుట్టుపక్కల ఉన్న కంపెనీ ఉద్యోగులను పోలీసు సిబ్బంది నాదర్ గుల్ దాటించారు.

"ప్రజలకు విజ్ఞప్తి! మీకు పొరపాటున పులి ఎదురైతే.. కంగారు పడి పరిగెత్తకుండా ప్రశాంతంగా ఉండటానికి ప్రయత్నించండి. నెమ్మదిగా వెనుకకు వెళ్లండి. పులి కళ్లలోకి చూడకండి. కానీ పులి వైపు తిరిగి ఉండండి. పులి కనుచూపు మేరలో కనిపించకుండా పోయే వరకు వెనుకకు నడవండి. వీలైనంత ఎత్తుగా నిలబడండి. నిటారుగా నిలబడటం ద్వారా పులి మీపై దాడి చేయదు. మీరున్న కరెంటు లొకేషన్ మాకు పంపిస్తే వెంటనే అక్కడికి చేరుకుంటాము" అంటూ అటవీ సిబ్బంది జీపులో తిరుగుతూ వారి సెల్ నెంబరు చెపుతున్నారు. రాంబాబు అటవీ సిబ్బంది సెల్ నెంబరు రాసుకున్నాడు.

"నాన్నా! పులి మనిషిని చంపి తినదటగా! బడిలో మాష్టారు చెప్పారు" అన్నాడు చింటూ.

"నిజమే! కానీ వాటిని మనం ఏమైనా చేస్తామని మనపై దాడి చేస్తాయి. మన జాగ్రత్తలో మనం ఉండాలి!" అన్నాడు రాంబాబు.

"ఏమోనండీ! మ్యానీటర్లు ఉంటాయట. మనిషి రక్తం తాగ మరిగిన పులులుంటాయని ఒక సినిమాలో చూశాను!" అంది పావని.

"రావిర్యాలలోని వండర్ లా వెనుక పులి లేగదూడను ఎత్తుకొచ్చి చంపి తిన్నది. రావిర్యాల గ్రామ ప్రజలు పశువులను ఇంట్లోనే కట్టి ఉంచుకోండి. బయటకు వదలొద్దు!" అంటూ ఒక ఫారెస్ట్ అధికారి హెచ్చరిక టీవీలో బ్రేకింగ్ న్యూస్‌గా వస్తుంది.

"నాన్నా! పులి నాదర్‌గుల్‌లో లేదా!?" చింటూ ప్రశ్నించాడు. రాంబాబు మాట్లాడలేదు.

"పులి ఎప్పుడు ఎక్కడుటుందో దానికే తెలీదు. అది దొరికే వరకు మనం జాగ్రత్తగా ఉండాలి" అంది పావని. ఫారెస్ట్ సిబ్బంది, పోలీసు సిబ్బంది రావిర్యాల వెళ్లారు. అధికారులను పులి ముప్పతిప్పలు పెడుతుంది. రావిర్యాలలో సిబ్బంది బోనులో గొర్రె పొట్టేలును ఎరగా ఉంచారు. అది బోనులో ఉన్న గొర్రెను చూసి కూడా అటు పోలేదు. పులి చాలా తెలివైన జంతువని అందరూ అనుకున్నారు. పులి మెదడులోని భాగమైన హిప్పోకాంపస్‌లో అధిక సంఖ్యలో మెదడు సినాప్సెస్ ఉండటం వలన పులికి తెలివి తేటలు ఎక్కువ. నిశితమైన పరిశీలనను కలిగి ఉంటాయి. గత అనుభవాల నుండి త్వరగా పాఠాలు నేర్చుకుంటాయి. చేసిన పొరపాటు మళ్లీ చేయకుండ జాగ్రత్త పడతాయి. సంఘటనా స్థలానికి సిబ్బంది అంతా చేరుకున్నారు. అక్కడ పులి లేదు.

పులి సగం తిని వదిలేసిన లేగదూడ మాత్రం కనిపించింది. "బాబూ! దూడ నా దేనయ్యా! నాకళ్ల ముందే పులి గుంజుకొచ్చిందయ్యా! బంగారం లాంటి దూడను పులి పొట్టన పెట్టుకుందయ్యా! నాకు సాయం చేయండి బాబు!" టీవీ కెమేరా ముందుబోరున ఏడుస్తుంది ఒక ముసలామె.

"పులి ఆహారం సగం తిని వదిలేసిందంటే.. తిరిగి మిగితాది తినటానికి ఇక్కడికే వస్తుంది. అది ఇక్కడే ఎక్కడో ఉంది. బీకేర్ ఫుల్! పులి ఉదయం కన్నా రాత్రే ఎక్కువగా వేటాడటానికి ఇష్టపడుతుంది. అది ఎంత బలంగా ఉన్నా దాని కంటి చూపు మాత్రం బలహీనమైనదే! పులులకు కంటి చూపు తక్కువగా ఉంటుంది. పగటిపూట బాగా చూడగలవు. కాని, రాత్రిపూట చూడటానికి ఇబ్బంది పడతారు. మనం దూరంగా ఉండి దాన్ని కనిపెట్టాలి. సిసి కెమేరాలో పులి కదలికలు గమనించండి! ఈ రాత్రికి ఎట్టి పవిస్థితుల్లో పులిని బంధించాలి. ఒక అధికారి సిబ్బందికి సూచనలిస్తున్నాడు.

'నాదర్ గుల్‌లో ఉన్న పులి వెంటనే రావిర్యాల ఎందుకు వెళ్లింది. అక్కడ కనిపించిన పులి ఈ పులి ఒకటేనా!? లేక రెండు పులులు వచ్చాయా!?' విలేకరులు కెమేరాలు ఫారెస్ట్ అధికారుల వైపు తిప్పి రకరకాల ప్రశ్నలు వేస్తున్నారు.

(సశేషం...)

- పైడిమర్రి రామకృష్ణ
m : 92475 64699



కథ

# సైబర్ మోసం




కిషోర్ అనే ఒక యువకుడు ఉండేవాడు. అతడి ఊరు వంగపల్లి. అతడు హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండేవాడు. అతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయడం వల్ల ఒత్తిడి ఎక్కువగా ఉండేది. రోజంతా ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లతోనే గడిపేవాడు. ఒక రోజు మధ్యాహ్నం అతని ఫోన్‌కు ఒక మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ని ఓపెన్ చేసి చూడగా మీ బ్యాంక్ ఖాతా బ్లాక్ అయింది. ప్రమాదంలో ఉందని వచ్చింది. మీరు వెంటనే ఈ లింకు క్లిక్ చేసి మీ వివరాలు అప్‌డేట్ చేయండి అని ఉంది. ఆ మెసేజ్ చూసిన కిషోర్ బ్యాంక్ పేరు చూసి భయపడ్డాడు. ఏమీ ఆలోచించకుండా లింక్ క్లిక్ చేసి అక్కడ తన పేరు మొబైల్ నెంబర్ ఎంటర్ చేసి ఓటీపీలను అడగగానే నిజమే అనుకొని అన్ని వివరాలు ఇచ్చాడు.

ఆ తర్వాత కొద్ది నిమిషాల్లోనే అతని ఫోన్‌కు బ్యాంకు నుంచి మెసేజ్ వచ్చింది ఆ మెసేజ్ చూడగా తన ఖాతా నుండి పది వేల రూపాయలు పోయాయని మెసేజ్ వచ్చింది. అది చూసిన కిషోర్ షాక్ అయ్యాడు. వెంటనే బ్యాంకు వెళ్లి విచారించగా అది నకిలీ లింక్ అని మేము పంపలేదని చెప్పారు. అప్పుడు కిషోర్‌కు అర్థం అయింది. వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించి కంప్లైంట్ ఇచ్చాడు. పోలీసులు అతనికి ధైర్యం చెప్పారు. సైబర్ నేరాల గురించి వివరించారు.

అతని ఇచ్చిన ఆధారాలతో కొన్ని రోజుల్లోనే ఆ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. అతని డబ్బు తిరిగి ఇప్పించారు. దానితో కిషోర్‌కు సంతోషం కలిగింది. కానీ తను చేసిన పొరపాటు మాత్రం జీవితాంతం గుర్తుండిపోయింది. అప్పటి నుంచి కిషోర్ జాగ్రత్తగా ఉన్నాడు ఇటువంటి ఏ లింకులను చూడకుండా తెలుసుకోకుండా ఓపెన్ చేసేవాడుకాదు. తన ఆఫీసులో స్నేహితులతో కూడా ఈ మాట చెబుతూ ఉండేవాడు. జాగ్రత్తగా ఉండమని ఎలాంటి అనవసర లింకులు క్లిక్ చేయకూడదు అని ఓటీపీలు ఎవరికి చెప్పకూడదు అని చెప్పేవాడు. ఎవరైనా కొత్త నెంబర్ నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయకూడదు అని కూడా చెప్పాడు.

***నీతి: ఈ కథ ద్వారా తెలిసిన నీతి ఏమిటంటే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.***


– డి. రవళి

9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

రేగులపల్లి, మం.బెజ్జంకి, జి.సిద్దిపేట

జి.లింగేశ్వర శర్మ (టీచర్), m: 96033 89441

# సింహం – కుందేలు కథ



ఒక అడవిలో ఒక సింహం ఉండేది. అది మృగాలన్నింటినీ చకచకా చంపి వేయసాగింది. ఇలా అయితే అడవి త్వరలోనే ఖాళీ అవుతుందని మృగాలు దాని దగ్గరకు వచ్చి ఇలా చెప్పుకున్నాయి.

"రాజా! ప్రతి దినం ఇన్ని ప్రాణాలు తీయడం దేనికి? ఒకసారి తినేది ఒక జంతువునే కదా? రోజూ ఒక మృగాన్ని మీ దగ్గరకు పంపుతాం. దానితో మీకు తృప్తి కలుగుతుంది. మీకు వేటాడే పని కూడా తప్పుతుంది."

అందుకు సింహం అంగీకరించింది. రోజూ ఒక మృగం దాని దగ్గరకు ఆహారంగా వస్తూ ఉండేది. ఒకసారి ఒక కుందేలు వంతు వచ్చింది. కుందేలు ఈ గండం నుంచి బయటపడేది ఎలాగని ఆలోచించసాగింది. అది సింహం దగ్గరకు పోతూ పోతూ ఒక బావిలోకి తొంగి చూసింది. అందులో తన ప్రతిబింబం కనబడడంతోనే, ఆ సింహాన్ని ఎలా చంపవచ్చు అనే ఉపాయం దానికి తట్టింది. చాలా సేపు పొదలలో తిరిగి, ఆలస్యంగా ఆ సింహం దగ్గరకి చేరింది. సింహం కోపంతో మండి పడుతూ, "నీకెంత పొగరు? ఇంత ఆలస్యంగా వస్తావా!" అని గర్జించింది. భయం నటిస్తూ కుందేలు, "రాజా! నేను వచ్చే దారిలో ఇంకొక సింహం ఎదురుగా వచ్చి నన్ను నిలవమని ఆజ్ఞాపించింది. నేను తమకు ఆహారంగా వెళుతున్నాననీ, కాబట్టి నన్ను విడిచిపెట్టమని చెప్పగా – 'వాడెవడు? ఈ అరణ్యానికి రాజును నేనే! ఇక్కడ నా మాటే చెల్లుబడి కావాలి!' అంటూ పట్టుపట్టింది. నేను అతికష్టం మీద ఆ సింహానికి ఏవేవో మాయ మాటలు చెప్పి తప్పించుకుని వచ్చేసరికి ఇంత ఆలస్యం అయింది" అని చెప్పింది.

అప్పుడు ఆ సింహం కోపంతో, "ఆ కొత్త సింహం ఎక్కడ ఉందో చూపించు. దాన్ని నేను చంపుతాను" అంది. కుందేలు ఆ సింహాన్ని బావి దగ్గరకు తీసుకుని పోయి కొత్త సింహం అందులో దాగి ఉందని చెప్పింది.

సింహం తన ప్రతిబింబాన్ని చూసి ఇంకొక సింహం అనుకుని భ్రమించి, గర్జించింది. బావిలో నుంచి ప్రతిధ్వని వినిపించింది. ఆ ప్రతిధ్వని విని ఆ సింహం కూడా గర్జిస్తున్నదనుకుని పట్టలేని కోపంతో ఆ బావిలోకి దూకింది. బయటకు రాలేక అక్కడే ప్రాణాలు విడిచింది.



**నీతి :**
**బుద్ధిబలం లేని కండబలం నిరర్థకం**

సేకరణ: అమరావతి




### తెలంగాణ చారిత్రక పర్యాటకం

# తెలంగాణలో జైనం

భారతదేశ చరిత్రలో జైనమతం క్రీ.పూ. ఏడవ శతాబ్దంలోనే ప్రచారంలో ఉంది. జైనమత సిద్ధాంతాల్ని క్రోడీకరించి వాటిని ఒక రూపంలో అందుబాటులోనికి తెచ్చిన వాడు వర్ధమాన మహావీరుడు. వైశాలిలో జన్మించిన ఇతను 30 ఏళ్ళ లోపలే ఇల్లు విడిచి దిగంబరుడై 12 సంవత్సరాల కఠోరమైన తపస్సు చేసి జినత్వం పొందాడు. జినత్వం అంటే జ్ఞానోదయం. శాంతి, నైతికత, ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇచ్చింది జైనం. అహింస, సత్యం, అపరిగ్రహం (ఇంకొకరి వస్తువులను తీసుకోకపోవటం), త్యాగం, తపస్సు, సమానత్వం వంటి విశిష్ట జీవన విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన ఈ మతం భారతీయ సంస్కృతి నిర్మాణంలో గణనీయమైన మార్పును తేగలిగింది. ఈ సాంప్రదాయాన్ని అనుసరించి జైనులకు 24 తీర్థాంకరులున్నారు. వీరిలో మొదటివాడు ఋషభనాథుడు, చివరివాడు మహావీరుడు. వైదిక కర్మలు చేయడం వల్ల దేవతారాధనం వల్ల మనిషికి ఉపయోగం లేదు. ఏ జీవికి చెడు చెయ్యకుండా మంచి జీవితాన్ని గడపడమే మోక్షమార్గం అన్నాడు మహావీరుడు. ఉత్తర భారత దేశంతో పాటు దక్షిణ భారతంలో జైనం విస్తరించి అనేక ప్రాంతాలలో సాంస్కృతిక ప్రభావాన్ని చూపింది. ఆ ప్రభావం తెలంగాణ ప్రాంతంలో కూడా విశేషంగా కన్పిస్తుంది. ప్రాచీన రాజవంశాల పరిపాలనలో జైనమతానికి ప్రోత్సాహం లభించింది. తొలి శాతవాహనులు జైనమతాన్ని పోషించినట్లు కోటిలింగాల మునులగుట్ట వద్ద దొరికిన నాణేలు, శాసనాలు ధృవీకరిస్తున్నాయి. క్రీ.శ. 150 తర్వాత జైనులు శ్వేతాంబర, దిగంబరులుగా ఏర్పడ్డారు. దక్షిణ భారతదేశంలో వాణిజ్య మార్గాల అభివృద్ధి, పట్టణ నాగరికత విస్తరణ, సన్యాస సాంప్రదాయాల ప్రాచుర్యం వల్ల జైనమతం తెలంగాణలో స్థిరపడింది. జైన సన్యాసులు ప్రజల మధ్య సంచరిస్తూ అహింసా సిద్ధాంతం, నైతిక జీవనం, త్యాగం, సత్యం వంటి విలువలను ప్రచారం చేశారు.


శాతవాహనుల తర్వాత తిరిగి బాదామీ చాళుక్యులు, రాష్ట్రకూటులు, వేములవాడ చాళుక్యులు, కాకతీయుల కాలంలో కూడా జైనం తెలంగాణలో బలంగా విస్తరించింది. ముఖ్యంగా క్రీ.శ. 8వ శతాబ్దం నుండి క్రీ.శ. 13వ శతాబ్దం వరకు జైన మతం అభివృద్ధిలో శిఖరాగ్రాన ఉన్నట్లు శాసనాలు, పురావస్తు ఆధారాలు తెలియజేస్తున్నాయి. జైనానికి రాజాదరణ, వాణిజ్య వర్గాల మద్దతు, తద్వారా ప్రజలను విశేషంగా ఆకర్షించింది. అస్సక రాజధాని బోధన్‌లో చాలా ప్రాచీనమైన జైన ప్రతిమలు లభించాయి. శ్రావణ బెళగొళలోని గోమతేశ్వర విగ్రహం బోధన్ బాహుబలి విగ్రహ నమూనాగా చరిత్రకారులు పేర్కొన్నారు. అక్కడి దేవల్ మసీద్ స్థంబాల పైన జైన ప్రతిమలు ఒకప్పుడు అది జైన దేవాలయంగా స్పష్టమవుతుంది. వేములవాడ చాళుక్యుల కాలంలో జైనం విలసిల్లిందనటానికి ఆధారం జగిత్యాల (నాటి కరీంనగర్) జిల్లా కురిక్యాల గ్రామంలోని బొమ్మలమ్మ గుట్టకు జైన చక్రేశ్వరి, రుషభనాధ మహావీరుడి శిల్పాలు నిదర్శనం. ఇక్కడి శాసనం తెలుగు భాషా ప్రాచీనతకు దోహదపడింది. అదే విధంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్లు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో అనేక ప్రాంతాలలో జైనశిల్పాలు, విగ్రహాలు, శాసన అవశేషాలు వెలుగులోనికి వచ్చాయి.

వనపర్తి జిల్లా గుమ్మడం, మహబూబ్‌నగర్ జిల్లా, గొల్లత్తగుడి, పెద్దపల్లి జిల్లా మునులగుట్ట, వికారాబాద్ ఎల్లకొండ (అనంతగిరి గుహలయాలు) మొగిలిచర్ల వరంగల్ జిల్లా, అగ్గలయ్యగుట్ట, పద్మాక్షిగుట్ట, హనుమకొండ, ఉజ్జిలి నారాయణపేట, నగునూరు, కరీంనగర్, పూదూరు జోగులాంబ గద్వాల, బైరాన్‌పల్లి, సిద్ధిపేట, కొలనుపాక యాదగిరి భువనగిరి, బాసర నిర్మల్, సుల్తానాబాద్, కరీంనగర్, కోరుట్ల జగిత్యాల, కుల్పారం మెదక్, పటాన్‌చెరువు సంగారెడ్డి వేల్పుగొండ మెదక్ జిల్లాలలో జైన చారిత్రక ప్రదేశాలు ముఖ్యమైనవి. ప్రస్తుతం తెలంగాణలో జైన క్షేత్రాలలో కొలనుపాక యాదాద్రి భువనగిరి జిల్లాలో మొదటి స్థానంలో జైనులకు ఆరాధ్య కేంద్రంగా విలసిల్లుతుంది. సుమారు 1000 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయ నిర్మాణ శైలి శిల్పకళ, ప్రశాంత వాతావరణం భక్తులను చరిత్రాభిమానులను విశేషంగా ఆకర్షిస్తుంది. కాకతీయుల అనంతరం శైవ వైష్ణ సంప్రదాయాలు పెరగడం, రాజకీయ మార్పులు రాజాదరణ తగ్గడం వల్ల జైనమత ప్రభావం క్రమంగా తగ్గింది.

– దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి
m : 9010051177

సైన్సు

# బాలనర్తకి




ఇంద్రుడు ఆజ్ఞాపిస్తే అప్సరసలు నృత్యం చెయ్యవలసిందే. అలాగే చేతులూ కాళ్లూ ఆడిస్తూ చిత్రంగా నృత్యం చేసే బొమ్మను మన ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. దీనికి కావలసిన వస్తువులు: రబ్బరు బ్యాండ్, ఎనిమిది పేపరు క్లిప్పులు, దళసరి అట్టముక్క, అట్టపెట్టి. బొమ్మలో చూపిన అమ్మాయిని దళసరి అట్ట ముక్క మీద "ట్రేసు" తీసి, జాగ్రత్తగా కత్తిరించాలి. దీనికి రంగులు కూడా వెయ్యవచ్చు. పేపర్ల క్లిప్పులు ఉపయోగించి, దానికి కాళ్లూ చేతులూ ఏర్పాటు చెయ్యాలి. సన్నని రబ్బరు బ్యాండ్‌ను ఈ బొమ్మ తలకి కట్టి, ఇనప తీగకి వేలాడదియ్యాలి. ఈ బొమ్మకి సరిగ్గా కింద కొద్ది దూరంలో విద్యుదయస్కాంతాన్ని అమర్చి, దానికి బేటరీ, స్విచ్చి కలపాలి. ఈ గారడీ ప్రేక్షకులకు తెలియకుండా ఉండటానికి అయస్కాంతం మీద అట్టపట్టెని బోర్లించి, కనిపించకుండా చెయ్యాలి. అంతే మిస్ పేపర్ క్లిప్ అనే నర్తకి నృత్యం చేయడానికి సిద్ధంగా ఉంది. స్విచ్చి వేస్తే ఇనప బోల్టు అయస్కాంతంగా మారి పేపరు క్లిప్పులను కిందికి లాగుతుంది. రబ్బరు బ్యాండ్ సాగుతుంది. కాళ్లూ చేతులూ ఆడిస్తూ పైకి కిందికీ ఎగురుతూ ఆ బొమ్మ చిత్రంగా నృత్యం చేస్తుంది. స్విచ్చి తీసేస్తే ఆట ఆగిపోతుంది. ఈ గమత్తు రక్తి కట్టాలంటే రబ్బరు బ్యాండ్ సున్నితంగానూ, అయస్కాంతం బలంగానూ ఉండాలి. బొమ్మ కాళ్లకీ, అయస్కాంతానికీ మధ్య దూరాన్ని జాగ్రత్తగా సర్దుబాటు చెయ్యాలి.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి



# పదాల మేడ




| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | | 9 | | ■ |
| 2 | | ■ | | | 3 |
| | ■ | 11 | ■ | 10 | |
| 5 | 4 | | 6 | ■ | |
| ■ | | ■ | | 8 | |
| 7 | | | ■ | | |

**అడ్డం:**

1) మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా (5)
2) లాభం (2)
3) భాగ్యం, శుభఫలితం ఎడమకు తిరిగింది (3)
5) నమ్మక ద్రోహం వెనుకకు తిరిగింది (4)
7) అంతరాయం (3)
10) పిసినారి (2)

**నిలువు:**

1) ఎప్పుడూ ఒకేలా చేస్తే అది (4)
3) పద్మవ్యూహాన్ని ఛేదించిన వీరుడు (5)
4) ఘర్షణ (3)
6) కృష్ణుడికి ప్రీతికరమైనది (2)
8) మరునాడు, తెల్లవారి తిరగబడింది (2)
9) ఇష్టం లేనిదే ఇది అంటారు (2)
11) పాలతో తయారయ్యేది (2)




– మాదారపు వాణిశ్రీ
హన్మకొండ
m : 9247286668

లఘు నాటిక

# హలో హలో




**పాత్రలు – పాత్రధారులు: మేధిని – ఉపాధ్యాయురాలు; కీర్తి – విద్యార్థిని సుచేతన, కీర్తి; విద్యార్థులు – భగవత్, భావుక్, దర్పణ్, శశాంక్; రాధిక – దర్పణ్ తల్లి**

(రాధిక వాళ్ళ ఇంటి వద్ద ఆ పక్క నుంచి మేధిని వెళ్తుంది)

రాధిక: నమస్తే మేడమ్.

మేధిని: నమస్తే చెప్పండి ఎవరు మీరు... మీరు ఇక్కడ!

రాధిక: నేను దర్పణ్ ఏడవ తరగతి అబ్బాయి వాళ్ళ అమ్మని ఇదే మా ఇల్లు. మీరు ఇటు వైపు వచ్చారేంటి మేడం?

మేధిని: మా బంధువుల ఇల్లు ఈ పక్కనే.

రాధిక: మేడం రండి లోపలికి.

మేధిని: లేదు ఇంకో సారి వస్తానులే.

రాధిక: అది కాదు మేడం మీరు సమయానికి దేవత లెక్క వచ్చిండ్రు ఒక్కసారి లోపలికి తొంగి చూడండి నా మాట వినండి ప్లీజ్.

మేధిని: సరే పదండి. (కొంచెం పక్కకి వస్తారు)

రాధిక: నాకు నా కొడుకు గురించి మస్తు గుబులైతుంది మేడం. మీరే ఎట్లయిన వాడిని దారిలో పెట్టాలి.

మేధిని: ఏమైంది ఎందుకలా అంటున్నారు?

రాధిక: ఈడ నుంచే మీరు ఆ మూల సప్పుడు చేయకుండా చూడండి మేడం ఇక్కడ ఏం జరుగుతుందో!

(దర్పణ్ శశాంక్ పుస్తకాలు ముందు పెట్టుకుని చేతిలో ఫోన్ పెట్టుకుని ఒకరి పక్కన ఒకరు కూర్చొని ఫోన్లో చూసుకుంటూ ఆడుతుంటారు)

దర్పణ్: ఒరేయ్ నాకు నేర్పించరా అంటే నువ్వే ఆడుతున్నావా?

శశాంక్: ఒరేయ్ ఉండు రా చూడు నేను ఎట్లా ఆడుతున్నానో.

దర్పణ్: అరే ఈ గేమ్ మస్తుగుందిరా శశాంక్! అరె చూడు ఎట్లయినా నేనే గెలుస్తా!

దర్పణ్: ప్లీజ్ రా ఒరేయ్ ప్లీజ్ రా నేను బి ఆడతారా.

శశాంక్: అరే ఆగు నీకు దమ్ముంటే గెలిచి చూపియ్యరా!

దర్పణ్: (అటు ఇటు చూసి) మా అమ్మ ఇంకా రాలే ఎట్లైనా గెలిచి చూపిస్తా అరే ఇవ్వు రా (అని నొక్కుతుంటాడు).

శశాంక్: అది రా అది సూపర్!

రాధిక: చూశారా మేడం ఆ శశాంక్ వచ్చి దర్పణ్‌కి ఏం నేర్పుతున్నాడో? వాళ్ళమ్మ ఆఫీసు నుంచి వచ్చేవరకు ఇక్కడ కూర్చోమని చదువుకోమని చెప్పి వెళ్తుంది. వాడు ఫోన్

తీసుకొచ్చి చేసే పని ఇది.

మేధిని: చూస్తున్న చూస్తున్న... మీరు ఇటు రండి. వాళ్ళతో ఇప్పుడు మాట్లాడి ప్రయోజనం లేదు వాళ్ళకు తగిన గుణపాఠం నేర్పాలి.

రాధిక: ఏం చేసుదు మేడం?

మేధావి: టెన్షన్ పడకండి రేపు మూడు గంటలకి బడికి రండి. నేను వచ్చి చూసిన సంగతి చెప్పకండి సరేనా!

రాధిక: సరే మేడం. నమస్తే.

మేధిని: నమస్తే.

* * *

**(మరుసటి రోజు 3 గంటలకు పాఠశాల ప్రాంగణం ఆడిటోరియంలో)**

రాధిక: మేడం నమస్తే మీరు రమ్మన్నారు.

మేధిని: రండి ఆ కుర్చీలో కూర్చుని అక్కడ పిల్లలు ఏం చేస్తున్నారో చూడండి.

రాధిక: అట్లనే మేడం (మేధిని స్టేజ్ పక్కన కుర్చీలో కూర్చొని ఉంటుంది స్టేజి మీద ఒకే రంగు దుస్తులు వేసుకొని కీర్తి సుచేతన, భగవత్, భావుక్ నిలబడి ఉంటారు) భగవత్... వెళ్లి ఏడవ తరగతి శశాంక్, దర్పణ్ లను పిలుచుకొని రా!

భగవత్: అలాగే మేడం.

మేధిని: చూడండి పిల్లలు మీరు ఇప్పుడు సైనికులు ఒక సమస్యను గురించి అందరికీ చెప్పాలి ఎలా అభినయంతో చెప్తారో చూస్తాను సరేనా!

భగవత్: వచ్చారు మేడం.

మేధిని: శశాంక్, దర్పణ్ కం హియర్.

శశాంక్, దర్పణ్: గుడ్ ఆఫ్టర్ నూన్ టీచర్

మేధిని: గుడ్ ఆఫ్టర్ నూన్ రండి ఇలా కూర్చుని వీరిలో ఎవరు చేసింది బాగుందో చెప్పండి.

**(శశాంక్, దర్పణ్ భయంగా చూస్తారు. దర్పణ్ వాళ్ళ అమ్మని చూసి భయపడతాడు. మెల్లిగా పక్కన కూర్చొంటాడు.) (షో మొదలౌతుంది)**

కీర్తి: సోదర సోదరీమణులారా రా అందరికీ నమస్కారం.

భావుక్: నా పేరు భావుక్.

సుచేతన: నా పేరు సుచేతన.

భగవత్: నేను భగవత్.

కీర్తి: మీకు కొన్ని దృశ్యాలు చూపిస్తాం. మా పేర్లు క్యారెక్టర్లు మారుతుంటాయి చూడండి.

## దృశ్యం - 1

కీర్తి: (కీర్తి చున్నీ వేసుకుంటుంది అమ్మలా) భానుకి అన్నం తిందువు గాని రా!

భావుక్: పుస్తకాల మధ్య సెల్లు నొక్కుతుంటాడు (అది ఆడియన్స్‌కి కనిపించాలి) ఉండమ్మా ఇంకాసేపు చదువుకొని వస్తాను. (సెల్లు చూస్తుంటాడు).

కీర్తి: ఎంతసేపు నాన్న (లోపలికి వస్తుంది)

భావుక్: సెల్ దాచేసి పుస్తకం పేజీలు తిప్పుతూ చదువుతాడు.

కీర్తి: మా నాయనే ముందు తినేసి తర్వాత చదువుకో సరేనా.

భావుక్: సరే అమ్మ (ప్లేట్ తీసుకుని గబగబ తినేసి లోపల ప్లేట్ పెట్టి మూతి తుడుచుకుంటూ వచ్చి తిరిగి సెల్ తీస్తాడు. నొక్కుతూనే ఉంటాడు. ఊగిపోతుంటాడు.)

భావుక్: హలో హలో భగవత్ ఏం చేస్తున్నావ్ రా? రేయ్ నీకు ఒక గేమ్ లింకు పెట్టిన చూడురా అదైతే నువ్వు అస్సలు వదిలిపెట్టవు రా.

భగవత్: అరె ఉండు రా మా డాడీ రాకముందే ఆడాలి. మా మమ్మీ సీరియల్స్ చూస్తుంది.

భావుక్: సరే రా బాయ్ (అని అటు ఇటు తిరుగుతూ ఆ ఫోన్ నొక్కుతూ పూర్తిగా లీనమై ఉంటాడు)

కీర్తి: భావుక్ హోం వర్క్ అయిందా (లోపలి నుంచి అంటుంది)

కీర్తి: ఇక లైట్ ఆఫ్ చేసి పడుకో.

భావుక్: పడుకుని కూడా ఫోన్ నొక్కుతుంటాడు.

## దృశ్యం - 2

సుచేతన: అమ్మ అమ్మ నాన్న వచ్చారా (బ్యాగు పద్ధతిగా టేబుల్ మీద పెడుతూ సాక్స్ తీసి లోపలికి వెళ్లి ముఖం తుడుచుకుంటూ వస్తుంది.)

కీర్తి: (అమ్మ పాత్ర ఇంకొక చున్ని వేసుకుంటుంది) వస్తారు ముందు ఈ జ్యూస్ తాగు ఏం కావాలి.

సుచేతన: (తాగుతూ) ఏం లేదమ్మా నేను రేపు ఒక టాపిక్ మీద ఆర్టికల్ రాయాలి. నాన్న గాని నువ్వు గాని నాకు హెల్ప్ చేయాలి ఈ ఫోన్లో రకరకాల సైట్స్ ఉన్నాయి. నాకు సరైన సైట్ చూపించి అదనపు సమాచారం సేకరించడంలో దేని నుంచి ఇన్ఫర్మేషన్ తీసుకోవాలో చెప్పాలి.

కీర్తి: ఏం టాపిక్ అమ్మా.

సుచేతన: ఎకోసిస్టమ్, కన్జర్వేషన్.

కీర్తి: ఓ పర్యావరణ వ్యవస్థ, పరిరక్షణ వీటికి సంబంధించినవి ఫోన్లో చూసుకో గూగుల్‌లో వెతుకు.

సుచేతన: అలా కాదమ్మా అందులో ఎన్నో రకరకాల సైట్స్ వస్తున్నాయి.

భావుక్: (కళ్ళజోడు పెట్టుకొని పెద్దవాడిలా వస్తాడు) ఏంటి ఏదో మాట్లాడుకుంటున్నారు?

కీర్తి: ఇదిగోండి నాన్న ఈ ఫోన్లో నాకు మీరు హెల్ప్ చేయాలి ఏది ఎంత వరకు ఎలా తీసుకోవాలో ఒక టాపిక్ గురించి (ఫోన్ ఇస్తుంది)

భావుక్: ఏది ఇలా ఇవ్వు (ఫోన్లో చూస్తాడు) దా ఇలా (అని పక్కన

కూర్చోబెట్టుకుంటాడు. మరో పక్క కీర్తి కూర్చుని ఫోన్‌లో చూస్తుంది)

భావుక్: (చూపిస్తూ చెబుతూ ఉంటాడు. కీర్తి వింటూ ఉంటుంది.)

సుచేతన: ఓకే ఓకే (అని నోట్ బుక్‌లో రాసుకుంటూ ఉంటుంది)

భావుక్, సుచేతన, కీర్తి: (ముగ్గురూ కలిసి హై-ఫై ఇచ్చుకుంటారు)

## దృశ్యం - 3

**(స్కూల్‌లో ఒక గదిలో టేబుల్ దాని మీద కంప్యూటర్/ లాప్‌టాప్, కుర్చీలు ఉండాలి. భగవత్ సార్ లాగా భావుక్, కీర్తి, సుచేతన విద్యార్థులుగా)**

భగవత్: భావుక్, సుచేతన, కీర్తి...

ముగ్గురూ: ఎస్ సార్.

భగవత్: గుడ్ న్యూస్ మన స్కూల్ కి ఒక మంచి అవకాశం వచ్చింది!

భావుక్: అవునా సర్ ఏంటది?

భగవత్: వివిధ రాష్ట్రాల నుంచి కొందరు విద్యార్థులు టీములు టీములుగా కలిసి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయాలి ఆ చేసిన ప్రజెంటేషన్‌లో ఎవరిది బాగుంటుందో దానిని ఎంపిక చేసి సింగపూర్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ సెమినార్‌లో ప్రజెంటేషన్ చేసే అవకాశం దొరుకుతుంది. మన స్కూల్ నుంచి ఒక టీంని పంపించమని లెటర్ వచ్చింది.

కీర్తి: ఇట్స్ గ్రేట్ న్యూస్ సర్!

సుచేతన: రియల్లీ.

భగవత్: అవును మనం దీన్ని చక్కగా ఉపయోగించుకుంటే మన స్కూల్‌కి, మన రాష్ట్రానికి, మన దేశానికి పేరు తీసుకొచ్చిన వాళ్ళమవుతాం.

కీర్తి: ఇంట్రెస్టింగ్ సార్.

సుచేతన: ఎక్సైటెడ్ సర్.

ముగ్గురు: మనం చేద్దాం సార్.

భగవత్: ఆగండి ఆగండి చేయడం అంత సులువేమీ కాదు మీరు కొంత సమయం దీనికోసం కేటాయించాలి. ఇక్కడ, ఇంట్లో కావల్సినంత సమాచారం సేకరించాలి.

కీర్తి: ఓకే డన్ సర్.

భగవత్: టాపిక్ ఎంచుకోవాలి ఉదాహరణకి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అనుకుందాం. సుచేతన కావాల్సిన ఇమేజెస్ అంటే బొమ్మలన్నీ కలెక్ట్ చేయాలి ఫోన్లో ఓపెన్ చేసి వెతికి డౌన్లోడ్ చేసి కంప్యూటర్ లోకి చేర్చుకోవాలి. గూగుల్ ద్వారా ఇతర సైట్స్ ద్వారా తీసుకోవాలి.... భావుక్ నువు ప్రెజెంటేషన్ విషయం టీచర్లను సంప్రదించి సేకరించాలి ఫోన్‌లో యూ ట్యూబ్‌లో వెతకాలి ఏదీ మిస్సవకూడదు.

భావుక్: ఓకే సార్.

భగవత్: కీర్తి నువ్వు స్లైడ్స్ తయారు చేయాలి.

కీర్తి: రైట్ సార్.

(మిగతా అంతా నటనలో చూపాలి. అటూ ఇటూ తిరుగుతూ ఫోన్‌లో వెతుకుతూ కీర్తి కంప్యూటర్ ముందు కూర్చొంటే... తనకి చెప్తూ కీర్తికి సమాచారం ఇవ్వడం కీర్తి కంప్యూటర్‌లో పని చేయడం అందరూ చర్చించుకుంటూ చివరికి డన్ అని షేక్ హ్యాండ్ ఇచ్చుకుంటారు.)

## దృశ్యం - 4

మేధిని: (కుర్చీలో కూర్చుని ఉంటుంది వేదిక మీద. శశాంక్, దర్పణ్, లలిత దగ్గరలో నిలబడతారు.) చూశారా పిల్లలు మూడు దృశ్యాలు వాళ్ల ఫలితాలు ఏంటో మీకు తెలుసుకోవాలని ఉందా? (ప్రేక్షకుల వైపు చూస్తూ) మొదటి దృశ్యంలో ఫోన్లో మాట్లాడుతున్న ఇద్దరు ఏమయ్యారో తెలుసా? ఆ సంవత్సరం పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. రెండో దృశ్యంలో ఆ అమ్మాయి సుచేతన స్కూల్ ఫస్ట్ వచ్చింది. మూడో దృశ్యంలో వాళ్ల టీము సింగపూర్లో ప్రజెంటేషన్‌కి ఎంపికైంది వాళ్ళందరూ వీరే.

**(సుచేతన, కీర్తి, భావుక్, భగవత్ వచ్చి నమస్కరించి నిలబడతారు) (అందరూ క్లాప్స్ కొడతారు.)**

మేధిని: కానీ పిల్లలు ఒక మాట అదే ఫోను ఉపయోగించి ఆటలకు కేటాయిస్తే ఏమైందో చూశారా? చూస్తే కానీ తెలియదని అందుకే లలిత గారు మిమ్మల్ని ఒకసారి రమ్మని చెప్పాను. అదే ఫోను తల్లిదండ్రులు సహాయంతో విద్యను మెరుగు పరచుకోవడానికి ఉపయోగిస్తే ఏం జరిగిందో చూశారు కదా! అదే ఫోను కంప్యూటర్ సహాయంతో టీచర్ సహాయంతో ఒక లక్ష్యంతో టీచర్ పర్యవేక్షణలో సరిగ్గా ఉపయోగిస్తే వారేం సాధించారో చూశారుగా.

లలిత: చూసాం మేడమ్.

శశాంక్, దర్పణ్: సారీ టీచర్.

మేధిని: మీకు అర్థం అవ్వాలని ఇలా చూపించాను. మీరు మాత్రమే కాదు మీ స్నేహితులకు బంధువులకి కూడా చెప్పండి సెల్ఫోను మన చేతిలో ఉన్నప్పుడు దానిని ఎలా ఉపయోగించాలి? ఎంతవరకు ఉపయోగించాలి? అన్న దానిమీద మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. మనం ఆటలకు ఉపయోగిస్తే మన సమయం వృధా అయిపోతుంది. ఎందుకు పనికి రాకుండా అవుతాం. అదే మంచిగా మన మేధ పదును పెట్టుకోవడానికి ఉపయోగిస్తే భవిష్యత్తులో మనం మంచి ఉన్నతమైన స్థితికి చేరుకుంటాం. అర్థమైంది కదా!

అందరూ: అర్థమైంది మేడం.

* * *

- డా. సమ్మెట విజయ
m: 99898 20215

# 'జర్మన్ దేశపు మేరీ క్యూరీ' లిజీ మీట్నర్

మహా శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చేత 'జర్మన్ దేశపు మేరీ క్యూరీ'గా పిలువబడిన మహిళా శాస్త్రవేత్త లిజీ మిట్నర్ (Lise Meitner). ఆమె అపురూపమైన పట్టుదల, అమితమైన ధైర్యసాహసాలతో పాటు విశేషమైన ప్రతిభతో విజ్ఞాన శాస్త్ర కృషిచేసి, అది మానవతకు తోడ్పడాలని భావించిన అభ్యుదయ వాది. ఆమె అవిరళ కృషికి గుర్తింపుగా పిరియాడిక్ టేబుల్ లో 109వ మూలకానికి 'మిట్నేరియం' (meitnerium) అని నామకరణం చేశారు. ఒకవైపు స్త్రీ అనే వివక్ష, మరోవైపు యూదులు అనే వివక్షను భరిస్తూ అనేక అడ్డంకులను అధిగమిస్తూ ఆటంబాంబు రూపకల్పనలో కీలకమైన 'కేంద్రక విచ్ఛిత్తి' (న్యూక్లియర్ ఫిషన్, Nuclear fission) ప్రక్రియకు దారులు వేసిన లిజీ మీట్నర్ దాదాపు 48 సార్లు నోబెల్ బహుమతికి నామినేట్ అయ్యారు, కానీ పొందలేదు.

ఆస్ట్రియా దేశపు నగరం వియన్నా లో 1878 నవంబర్ 7న యూదుడైన న్యాయవాది ఫిలిప్ మీట్నర్ కున్న ఎనిమిది మందిపిల్లల్లో లిజీ మూడవ సంతానం. వారిది కలిగిన కుటుంబమే అయినా, అమ్మాయి కనుక 14వ ఏట సెకండరీ స్కూలు స్థాయిలోనే చదువు ఆగిపోయింది. అయితే పెద్దల ప్రోద్బలంతో ఇంటిలో ట్యూషన్ ద్వారా చదువుకొని తన 20 ఏట యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష పాసయ్యారు. ఆ దేశానికి అప్పటి కాలానికి ఇది చాలా విశేషమైన విషయం. 1897లో యూనివర్సిటీ ఆఫ్ వియన్నా మొదలు కావడం, అందులో ప్రఖ్యాత శాస్త్రవేత్త లుడ్విగ్ బోల్ట్జ్‌మన్ (Ludwig Boltzmann) భౌతిక శాస్త్రాన్ని బోధించడం కలిసి వచ్చిన అవకాశం. చాలా రకాల వ్యతిరేకతను భరిస్తూ ఆయన పర్యవేక్షణలో 1906 లో పీహెచ్డీ పూర్తిచేసి, ఆ యూనివర్సిటీ నుంచి అలా పరిశోధక పట్టా పొందిన రెండవ మహిళ అయ్యారు. ఉద్యోగ అవకాశాల కోసం 1907లో ఆమె బెర్లిన్ వెళ్లారు. తొలుత బెర్లిన్ విశ్వవిద్యాలయంలో జీతం లేని కార్పెంటర్‌గా చేరారు, ఎందుకంటే అక్కడ మహిళలకు ప్రయోగశాలలో శాస్త్రవేత్తగా పని చేయడానికి లేదా ఉపన్యసించడానికి అవకాశాలుండేవి కావు కనుక. లిజీ అదే సంవత్సరం కైజర్ విల్ హెల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమిస్ట్రీ (Kaiser Wilhelm Institute for Chemistry)లో రసాయన శాస్త్రవేత్త ఒట్టహాన్ (Otto Hahn) వద్ద చేరి సుమారు మూడు దశాబ్దాల పాటు పనిచేశారు. వీరిద్దరూ రేడియో ధార్మికతకు సంబంధించిన పరిశోధనలతో పాటు 1917-18 కాలంలో ప్రోటాక్టీనియం (protactinium, Pa-231) అనే ఐసోటోపును ఆవిష్కరించారు. 1926లో జర్మనీ దేశపు తొలి భౌతిక శాస్త్రం మహిళా ఆచార్యులయ్యారు, స్వీడిష్ రాయల్ అకాడమీ సభ్యులు కూడా అయ్యారు. 1966లో మరో ఇద్దరు శాస్త్రవేత్తలతో కలిసి ఎన్రికో ఫెర్మీ (Enrico Fermi Award) పొందారు.



అంతకుముందు మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఆస్ట్రియా దేశం తరఫున తన సామర్థ్యం దృష్ట్యా ఎక్స్‌రే నర్స్‌గా సేవలందించారు, తర్వాతనే పరిశోధనకు అవకాశం కలిగింది. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో కీలకమైన ప్రక్రియ న్యూక్లియర్ ఫిషన్ (Nuclear fission)కు సంబంధించిన మౌలికమైన దశలు బీటా డికే (beta decay), న్యూట్రాన్ ఇంటరాక్షన్ (neutron interactions), యురేనియం బొంబార్డ్ మెంట్ (uranium bombardment) వంటి వాటిలో ఎంతో ప్రగతి సాధించారు. 1938 క్రిస్మస్ సమయంలో అద్భుతమైన ఫలితం పొడచూపింది, దానికి ఆమె 'న్యూక్లియర్ ఫిషన్' అని నామకరణం చేశారు. అణువిచ్ఛిత్తి జరిగినప్పుడు అమితమైన స్థాయిలో శక్తి విడుదలవుతుందని తెలిపే ఈ ఆవిష్కరణ 1939లో 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమైంది. మ్యాక్స్ ప్లాంక్, నీల్స్‌బోర్ వంటి శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉన్న నోబెల్ బహుమతుల కమిటీలు లిజీ మీట్నర్‌ను 1924-1948 మధ్యకాలంలో రసాయన శాస్త్రం సంబంధించి 19 సార్లు, 1937-1967 మధ్యకాలంలో భౌతిక శాస్త్రం సంబంధించి 30 సార్లు నామినేట్ చేశారు. నిజానికి న్యూక్లియర్ ఫిషన్ సంబంధించి 1944లో రసాయన శాస్త్ర విభాగంలో ఒట్టహాన్ నోబెల్ బహుమతి పొందినప్పుడు లిజీ మీట్నర్ కచ్చితంగా భాగస్వామి అయి ఉండాలి. నాజీల సెన్సార్షిప్ తప్పించుకోవడానికి పరిశోధనా పత్రాలలో ఆమె పేరు పరిహరించడం వల్ల ఈ అనర్థం జరిగింది. లిజీ మీట్నర్‌కు ఇలా అన్యాయం జరగడం సంబంధించి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చాలా నొచ్చుకున్నారు, బాధ్యులను కోప్పడ్డారు. ఆ సందర్భంలోనే ఆమెను 'జర్మనీ దేశపు మేరీ క్యూరీ'గా ప్రస్తుతించారు. మహిళ కావడం వల్ల ఆమె భరించిన ఈ వ్యతిరేకత చాలా సిగ్గుపడే విషయం. తొలుత ప్రయోగశాలలో ప్రవేశం నిషేధిస్తే భవనం బేస్‌మెంట్లో ఆమె పనిచేయాల్సి వచ్చింది. 1933లో టీచింగ్ లైసెన్సును రద్దు చేయడం కూడా జరిగింది. 1938లో నీల్స్ బోర్ వంటి మిత్రులు ఆమెను రహస్యంగా స్వీడన్‌కు పంపేశారు, ఆ సమయంలో ఆమె వద్ద 20 మార్కుల ధనం తప్పా మరేమీ లేదు. వెలివేసిన సమయంలో స్టాక్ హోమ్‌లో ఆమెకు శాస్త్రవేత్తగా ఎంతో పేరు ఉన్నా వివక్ష కారణంగా ఎటువంటి జీతం లేకుండా పని చేయడం దౌర్భాగ్యమైన స్థితిని సూచిస్తుంది. చాలా పరిమితమైన వనరులతో 1960 దాకా అక్కడి పరిశోధన శాఖలో పని చేసే ఎన్నో ఫలితాలు సాధించారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ ఆహ్వానించినా తిరస్కరించారు. తన 89 ఏట ఇంగ్లాండులోని కేంబ్రిడ్జ్‌లో 1968 అక్టోబర్ 27న లిజీ మీట్నర్ కన్నుమూశారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఆటంబాంబు వినియోగించి మానవ వినాశనం చేయడాన్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిసైన్స్ అనేది నిస్వార్థంగా సమాజాన్ని సత్యం వైపు, నిష్పాక్షికతవైపు నడిపించాలి. సైన్సు అనేది ఆశ్చర్యంతోను, ఆరాధనతోనూ వాస్తవికతను అంగీకరించడాన్ని బోధించాలి. అంతేకానీ కొందరి వ్యక్తిగత ప్రయోజనాల కోసం లేదా రాజకీయ లక్ష్యాల కోసం అది దారి తప్పకూడదు." అని బలంగా విశ్వసించిన ఆమె కీర్తి కన్నా ఆత్మసాక్షికి, సొంత ఆశయం కన్నా సమిష్టి ప్రయోజనం మిన్న అని కూడా భావించేవారు. ఆమె సమాధి శిలాఫలకంపై 'చివరి కంటా మానవత్వాన్ని కోల్పోని భౌతిక శాస్త్రవేత్త' (A physicist who never lost her humanity) అని లిఖించడం ఎంతో అర్థవంతం.

- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత
m : 9440732 392






# ఈత చెట్టు

హాయ్ బాలలూ! ఎలా ఉన్నారు? వేసవి సెలవులలో దోస్తులతో బాగా ఎంజాయ్ చేశారు కదా! మనం ఈ నెల బాలచెలిమి సంచికలో 'ఈత చెట్టు' గురించి తెలుసుకుందాం.. ఓకేనా!


ఈత చెట్లు సాధారణంగా మెట్ట, గుట్టల ప్రాంతాలలో బావుల వద్ద సహజంగా కనిపిస్తాయి. ఒకప్పుడు బాల్యంలో ఎండాకాలం సెలవులలో విద్యార్థులు ఈత పండ్లు బాగా తినేవారు. ఇది పుష్పించే మొక్క. 'పామ్' కుటుంబానికి సంబంధించినది. ఈత చెట్టును ఇంగ్లీషులో wild Date Palm అని పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం ఫోనిక్స్ సిల్వేస్ట్రైన్ (Phonix Sylvestris). ఈత చెట్ల జీవిత కాలం సుమారు వెయ్యి సంవత్సరాలకు పైగా ఉంటుంది. ఈత చెట్లు నాలుగు నుండి పదిహేను మీటర్ల ఎత్తు వరకు పెరిగి ఖర్జూర చెట్టును పోలి ఉంటాయి. ఈత ఆకులు సుమారు 2-3 మీటర్ల పొడవు ఉండి ఆకుల చివరన సన్నని ముల్లును కలిగి ఉంటాయి. అవి పశువులు, మేకలు వంటి వాడి నుండి రక్షణ పొందుతాయి. ఈత ఆకులతో చాపలు, బుట్టలు, గంపలు, గుల్లలు తయారు చేస్తారు. సంచార వృత్తుల వారికి ఈత చెట్లు ఉపాధి కలిగిస్తాయి. ప్రతి చెట్టు నాటిన నాలుగు లేదా ఐదు సంవత్సరాల తర్వాత కాయలు కాసి పండ్లు పండుతాయి. ఈత చెట్టు కాయలుగా ఉన్నప్పుడు ఆకుపచ్చ రంగులోనూ, తర్వాత బంగారు వన్నెలోనూ, పండినప్పుడు లేత నలుపు కాషాయ రంగులో చూడ ముచ్చటగా ఉండి తింటే కమ్మగా ఉంటాయి. సంవత్సరానికి ఒకసారి వేసవి కాలంలో ఒక్కో చెట్టు 10-15 గెలలుగా, ఒక్కో గెల 500 నుండి 1000 పండ్లను కాస్తుంది. ఇటీవల కాలంలో ఈత చెట్లను ఉద్యానవనంలో అందం కొరకు బాగా పెంచుతున్నారు.


ఈత చెట్లు కొబ్బరి లేదా తాటి చెట్ల వలె నిటారుగా పెరుగుతాయి. ఈత చెట్ల నుండి కల్లును కూడా తీస్తారు. తాగితే ఆరోగ్యానికి ఎంతో మంచిదని చాలామంది చెబుతారు. ఈ చెట్లు భారత ఉపఖండంలో బాగా పెరుగుతాయి.

ఇవి నీటి ఎద్దడిని బాగా తట్టుకుని పెరుగుతాయి ఒకప్పుడు వ్యవసాయదారులు ఈత చెట్ల మట్టల నుండి నార తీసి పశువులను కట్టేసే తాళ్లు, పలుపులు పేనేవారు. కొన్ని కొన్ని ప్రాంతాలలో ఈత బెల్లం కూడా తయారు చేస్తారు. ఈత పండ్లు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మంచిది.

చూశారు కదా బాలలూ.. ఈత చెట్టు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. మనం కూడా అందుబాటులో వృధా ఉన్న జాగలో ఈత చెట్లను నాటుదాం. కనుమరుగు కాకుండా చూస్తూ పర్యావరణాన్ని కాపాడుదాం. వచ్చే నెలలో మరో చెట్టు గురించి తెలుసుకుందాం.

- కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655


క్షమా గుణం
విన్న కథకు అనుసృజన :
జుగాష్విలి
బొమ్మలు:
గోపి: తాతయ్యా! కథ చెప్పవా? మా ఫ్రెండ్ రవి కూడా వచ్చాడు.
తాతయ్య: సరే! యిద్దరూ యిలా రండి.
తాతయ్య: అనగనగా ఒక రాజు ఆ రాజు గారి దగ్గర ఒక గుర్రం వుంది. ఆ గుర్రానికి అందమైన గుర్రపు పిల్ల పుట్టింది. ఆ పిల్ల కన్ను దగ్గర చిన్న లోపం వుంది.
గోపి & రవి: అయ్యో! పాపం!
తాతయ్య: కొంచెం పెద్దయ్యాక గుర్రపు పిల్ల వాళ్ళమ్మతో "అమ్మా! అమ్మా! నేను చాలా అందంగా వున్నాను. బలంగా వున్నాను. ధైర్య సాహసాలున్నాయి. నా కంటి దగ్గర ఈ లోపం ఎందుకమ్మా" అంది.
గోపి: ఆ తల్లి ఎంత బాధపడిందో..
తాతయ్య: బాధ వుంటుంది కదరా! తల్లి గుర్రం "ఒక రోజు రాజు గారితో అడవికి వెళ్లాం. రాజు గారి కొరడా దెబ్బ పొరపాటున నా పొట్టకు తగిలింది. నా పొట్టలో వున్న నీకు ఆ దెబ్బ తాకింది" అని చెప్పింది.
గోపి: గుర్రపు పిల్లకి బాగా కోపం వచ్చిందా?
తాతయ్య: అవును. దానికి నీకు లాగే కోపమెక్కువ. అప్పుడు గుర్రపు పిల్ల "అయితే నా కన్ను యిలా అనడానికి రాజు గారు కారణమన్న మాట. నేను పెద్దయ్యాక రాజు గారి మీద కక్ష తీర్చుకుంటానమ్మా" అంది.
గోపి & రవి: భళే! భళే!


తాతయ్య: అప్పుడు తల్లి గుర్రం "తప్పు నాన్నా! అది పొరపాటున జరిగింది. నువ్వు చూస్తున్నావు కదా! రాజుగారు చాలా మంచివారు. ఈ ద్వేషాలూ, కక్షలు మంచివి కాదు తల్లీ!" అని హితవు పలికింది.
గోపి : ఇదేం బాలేదు తాతయ్యా. గుర్రపు పిల్లే కరెక్ట్.
తాతయ్య: హ..హ... సరే.. కొన్ని సంవత్సరాలు గడిచాయి. తల్లి గుర్రం ముసలిదైంది. గుర్రపు పిల్ల పెద్దదైంది. రాజుగారు ఎక్కడికి వెళ్ళినా దీన్నే ఉపయోగిస్తున్నారు.
గోపి : మంచి ఛాన్స్. ఇక కక్ష తీర్చుకుంటుందిలే.
తాతయ్య: మ్... ఒక రోజు శత్రు దేశపు రాజు సైన్యంతో దండెత్తాడు. ఈ రాజు గారి సైన్యం పోరాడి ఓడిపోయింది. రాజుగారు గాయపడి ప్రాణాపాయ స్థితిలో వున్నారు. గుర్రపు పిల్ల బాధపడింది. "అయ్యో, రాజు గారు చనిపోయేలా వున్నారే! ఎలాగైనా కాపాడాలి" అనుకుంటూ రాజుగారిని తీసుకుని వైద్యుల వద్దకు తీసుకు వెళ్ళింది. వైద్యులు రాజు గారి ప్రాణాలు కాపాడారు.
గోపి : కక్ష తీర్చుకునే అవకాశం వదులుకుందే...
తాతయ్య: గుర్రపు పిల్ల తల్లి దగ్గరకు వెళ్ళి జరిగిందంతా చెప్పింది. "అమ్మా నాకు రాజుగారి మీద కోపం, కక్ష ఉన్నాయి కదా! ఎందుకమ్మా రాజు గారిని కాపాడాను" అని అడిగింది. "అది నీ సంస్కారం తల్లీ! ప్రతి జీవిలోనూ సహజంగా ప్రేమ, కరుణ, క్షమాగుణం వుంటాయి. అహంకారం, ద్వేషం, కోపం, ప్రతీకారం వంటి చెడు గుణాలు వాటిని అడ్డుకుంటాయి. ఈ చెడు గుణాలను దాటి నీ సంస్కారం గెలిచింది తల్లీ" అంటూ తల నిమురుతూ దగ్గరకు తీసుకుంది.
తాతయ్య: గోపీ! రవీ! కథ విన్నారుగా. కథ వింటున్నంత సేపూ నెగెటివ్‌గా మాట్లాడుతున్నారు మీరు. అది చాలా తప్పు. ప్రతి మనిషి కరుణ, ప్రేమ, క్షమాగుణం వంటి విలువలు అలవరచుకోవాలి. అదే ఈ కథ నీతి.
గోపి : సారీ తాతయ్య! ఇక అలా ఉండం.

## దేశానికి క్రీడాకారులను అందించిన నిశ్శబ్ద సేవకుడు

# "బల్దేవ్ సింగ్"కు పద్మశ్రీ పురస్కార గౌరవం

బల్దేవ్ సింగ్ 1951 ఆగస్టు 23న పంజాబ్ రాష్ట్రంలోని భగ్రారి గ్రామంలో జన్మించారు. ప్రస్తుతం ఆయన వయస్సు డెబ్బై ఐదు సంవత్సరాలు. భారత హాకీ రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ కోచ్‌గా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. భారత హాకీ రంగానికి అంకితభావంతో సేవలందించిన ప్రముఖ కోచ్ బల్దేవ్ సింగ్ కు దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన "పద్మశ్రీ" పురస్కారం ప్రదానం చేయనుండటం క్రీడా ప్రపంచానికి ఆనంద దాయకమైన సందర్భంగా నిలిచింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మే 25న ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందజేయనున్నారు. హాకీ క్రీడాభివృద్ధికి ఆయన అందించిన అమూల్యమైన సేవలకు దేశం ప్రకటించిన గౌరవంగా దీనిని భావిస్తున్నారు. జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 సమీపంలోని షాహాబాద్ మార్కండా అనే ప్రశాంత పట్టణాన్ని ప్రతిభావంతులైన హాకీ క్రీడాకారుల కేంద్రంగా తీర్చిదిద్దడంలో బల్దేవ్ సింగ్ విశేష కృషి చేశారు. 1982లో హర్యానా క్రీడాశాఖ కోచ్‌గా షహాబాద్ మార్కండాకు వచ్చిన బాల్‌దేవ్ సింగ్, అక్కడ మహిళా హాకీకి కొత్త దిశ చూపించారు. అనంతరం 1993లో తిరిగి అక్కడికి చేరుకుని యువ క్రీడాకారులకు నాణ్యమైన శిక్షణ అందిస్తూ ఆ ప్రాంతాన్ని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన హాకీ శిక్షణా కేంద్రంగా అభివృద్ధి చేశారు. భైనీ సాహిబ్‌కు చెందిన నామ్‌ధారి హాకీ జట్టుతో తన క్రీడా జీవితాన్ని ప్రారంభించిన బల్దేవ్ సింగ్, బెంగళూరులోని జాతీయ క్రీడా సంస్థలో హాకీ కోచింగ్‌లో డిప్లొమా పూర్తి చేశారు. శాస్త్రీయ దృక్పథంతో శిక్షణ అందిస్తూ, ఆయన 80 మందికి పైగా అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దారు. భారత హాకీ జట్టుకు నాయకత్వం వహించిన పలువురు కెప్టెన్లు కూడా ఆయన శిష్యులుగా నిలవడం విశేషం. క్రీడా నైపుణ్యాల అభివృద్ధితో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, దేశభక్తి వంటి విలువలను యువతలో పెంపొందించడంలో ఆయన చూపిన నిబద్ధత ప్రశంసనీయం. గ్రామీణ ప్రాంతాల యువతకు అవకాశాలు కల్పిస్తూ, వారి ప్రతిభను జాతీయ స్థాయికి చేర్చిన ఆయన సేవలు భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. బల్దేవ్ సింగ్‌కు లభిస్తున్న ఈ గౌరవం కేవలం వ్యక్తిగత విజయమే కాకుండా భారత హాకీ అభివృద్ధికి కృషి చేస్తున్న కోచ్‌లందరికీ ప్రేరణగా నిలవనుంది. నిజమైన గురువు కేవలం ఆటగాళ్లను తయారు చేయడు, సమాజాన్ని మారుస్తాడు. ఆయన చేతుల మీదుగా వెలుగులోకి వచ్చిన ప్రతి క్రీడాకారుడు, భారత హాకీ చరిత్రలో ఒక విజయగాథగా నిలిచాడు. క్రీడా ప్రపంచంలో ఆయన పేరు ఇకపై కేవలం కోచ్‌గా కాదు, "ప్రతిభను పుట్టించిన మహాగురువు"గా చిరస్థాయిగా నిలిచిపోతుంది.




– బాలచెలిమి డెస్క్

## అభిమానుల ఆనందోత్సాహంలో హైదరాబాద్ విజయం

18.04.2026 నాడు హైదరాబాద్ జట్టు స్వస్థల అభిమానులకు చిరస్మరణీయ ఆనందాన్ని అందించింది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ క్రీడాంగణంలో జరిగిన ఉత్కంఠభరిత పోరులో హైదరాబాద్ ఆటగాళ్లు సమిష్టి ప్రదర్శనతో అభిమానులను అలరించారు. ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 194 పరుగులు సాధించి ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు. హైదరాబాద్ బ్యాటర్లు వేగంగా పరుగులు రాబట్టి ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపారు. భారీ షాట్లు, వేగవంతమైన పరుగులతో క్రీడాంగణం కేరింతలతో మార్మోగిపోయింది. చెన్నై జట్టు చివరి వరకు పోరాడినా, హైదరాబాద్ బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ముందు నిలవలేక ఎనిమిది వికెట్ల నష్టానికి 184 పరుగులకే పరిమితమైంది. చివరి ఓవర్లలో హైదరాబాద్ బౌలర్లు అద్భుత నియంత్రణ ప్రదర్శించి ప్రత్యర్థి పరుగుల వేగాన్ని తగ్గించారు. ఈ విజయంతో హైదరాబాద్ జట్టు అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.




**మ్యాచ్ స్కోరు వివరాలు: హైదరాబాద్ జట్టు – 194/6; చెన్నై జట్టు – 184/8**

– బాలచెలిమి డెస్క్

కథ

# నిజం తెలుసుకున్న నిఖిల్



నిఖిల్ ఆరవ తరగతి చదువుతున్నాడు. వాడికి ఒక బలహీనత ఉండేది. వాడు చెప్పింది ఎవరైనా కాదన్నా, వాడడిగింది ఏదన్నా లేదన్నా విపరీతంగా బాధ పడేవాడు. వాడనుకున్నదానికి వ్యతిరేకంగా చిన్న విషయం జరిగినా "నన్నెవరూ అర్థం చేసుకోవడం లేదు. నన్నెవరూ ఇష్టపడరు" అనుకునేవాడు.

ఒక రోజు బడిలో చిత్రలేఖన పోటీ జరిగింది. ఆ పోటీలో పాల్గొన్న నిఖిల్ ఎంతో శ్రద్ధగా ప్రకృతిని చిత్రిస్తూ చిత్రం వేశాడు. ఆ సాయంత్రం ఫలితాలు చెప్పినప్పుడు వాడి పేరు చెప్పలేదు. బహుమతులన్నీ వేరే పిల్లలు దక్కించుకున్నారు. తరగతిలోని పిల్లలంతా బహుమతి పొందిన వాళ్లని అభినందిస్తూ చప్పట్లు కొట్టారు. నిఖిల్ మాత్రం మౌనంగా కూర్చున్నాడు.

"డ్రాయింగ్ టీచరుకి నేను నచ్చలేదు కాబోలు. అందుకే నాకు బహుమతి ఇవ్వలేదు" అనుకున్నాడు నిఖిల్.

కొన్నాళ్ల తరువాత మరో సంఘటన జరిగింది. మధ్యాహ్నం భోజన సమయంలో నిఖిల్ వెళ్లి అర్జున్ ప్రక్కన కూర్చోబోయాడు. కానీ వాడు అక్కడ నుంచి వెంటనే వెళ్లి పోయి మరో మరో బెంచ్ దగ్గర కూర్చున్నాడు. నిఖిల్‌కి ఎంతో బాధ అనిపించింది. "నాతో కూర్చోవడం అర్జున్‌కి ఇష్టం లేదు. నేను నచ్చలేదు కాబోలు" అనుకున్నాడు.

మరోసారి గణితం తరగతిలో ఒక కష్టమైన సమస్య ఇచ్చి 'ఎవరైనా పరిష్కరించగలరా' అని అడిగారు ఉపాధ్యాయుడు. నిఖిల్ సమాధానం చెప్పేందుకు లేచి నిలబడ్డాడు. వాడు కొంచెం తడబడడంతో ఉపాధ్యాయుడు మరో పిల్లాడిని జవాబు చెప్పమని అడిగారు.

"నేను సరిగ్గా చెప్పలేనని అనుకుని నన్ను పట్టించుకోలేదు మాష్టారు " అని మళ్లీ బాధపడ్డాడు నిఖిల్.

ఆ రోజు ఇంటికి వెళ్లి నిశ్శబ్దంగా కూర్చున్నాడు.

నిఖిల్ ఇంటికి వెళ్లాక మౌనంగా కూర్చోవడం తరచూ జరుగుతుండే సరికి వాళ్ల చిన్నాన్నకి అనుమానం వచ్చింది.

"ఏమైంది నిఖిల్? ఒక్కోసారి బడి నుండి వచ్చి విచారంగా కూర్చుంటున్నావు" అని అడిగాడు. అంత త్వరగా నిఖిల్ ఏమీ చెప్పలేదు. కానీ వాళ్ల చిన్నాన్న మళ్ళీ మళ్లీ చెప్పమని అడిగేసరికి బడిలో జరిగినవి, జరుగుతున్నవి సంఘటనలన్నీ కలిపి చెప్పాడు. అందువల్ల తనకి కలుగుతున్న దుఃఖాన్ని కూడ చెప్పాడు నిఖిల్.

"నేనంటే ఎవరికీ ఇష్టం లేదేమో" అన్నాడు చివరగా ఏడుపు ముఖం పెట్టి.

దానికి వాళ్ల చిన్నాన్న బిగ్గరగా నవ్వాడు. "ఎందుకు నవ్వుతున్నావు. నేను చెప్పింది నిజం" అన్నాడు నిఖిల్.

"అదేం కాదురా! నువ్వు అపోహ పడుతున్నావు. అంతే! నీలో నువ్వు బాధపడడం వల్ల ఎలాంటి ప్రయోజనం గానీ, ఫలితం గానీ ఉండదు. ఒకపని చెయ్యి. వాళ్లతో మాట్లాడి ఎందుకలా చేసారో చెప్పమని అడుగు.

అప్పుడు అసలు సంగతి తెలుస్తుంది. నీది అపోహ అని తేలిపోతుంది" అని చెప్పాడు.

అదేదో బాగున్నట్టు అనిపించింది నిఖిల్‌కి. సరేనని చిన్నాన్నకి మాట ఇచ్చాడు.

తరువాత రోజు బడికి వెళ్లినప్పుడు ముందుగా

చిత్రలేఖనం పోటీల్లో బహుమతి రాని విషయం తేల్చుకోవాలని అనుకున్నాడు నిఖిల్. మాష్టారుని కలిసి ఆ విషయం అడిగాడు.

దానికి మాష్టారు "నీ చిత్రం బాగుంది. కానీ ఈసారి రంగుల కలయికపై ఎక్కువ మార్కులు ఇచ్చాం. నువ్వు ఇంకాస్త ప్రయత్నిస్తే తప్పకుండా బహుమతి గెలుచుకుంటావు" అని చెప్పడంతో తన ఆలోచన తప్పని నిఖిల్‌కి అర్థమైంది.

అదే రోజు భోజన సమయంలో అర్జున్ కనబడినప్పుడు, భోజనం బల్ల దగ్గర ఎందుకలా ప్రవర్తించాడో చెప్పమని వాడిని అడిగాడు నిఖిల్.

దానికి అర్జున్ నవ్వుతూ "అదా! మా అన్నయ్య వస్తానన్నాడు. అందుకే నీ దగ్గర కాకుండా వాడికోసం వేరే బెంచ్ దగ్గర కూర్చున్నాను. నీకప్పుడే చెప్పాల్సింది. ఆకలి వేయడంతో తినడం మీద దృష్టి పెట్టాను. పైగా నువ్వు కూడా ఏమీ అడగలేదు. నువ్వు అడిగితే అప్పుడే చెప్పేవాడిని కదా " అని బదులిచ్చాడు.

ఆ విషయంలో కూడ తన ఆలోచన తప్పియిందని గ్రహించాడు నిఖిల్. మిగిలింది గణిత ఉపాధ్యాయుడి విషయం. అది కూడ అడిగేస్తే సరిపోతుందని మనసులో అనుకున్నాడు.

గణితం ఉపాధ్యాయుడు తరగతి గదికి వచ్చినప్పుడు 'సమాధానం చెప్పాలని నిలబడిన తనని మానేసి వేరే విద్యార్థిని అడగడానికి కారణం' చెప్పమని అడిగాడు నిఖిల్. దానికాయన నవ్వుతూ "ఆ రోజు క్లాస్ బెల్ మోగే సమయం దగ్గర పడడంతో త్వరగా సమాధానం చెప్పేవారిని అడిగాను" అనడంతో తన ఆలోచన ఈసారీ తప్పయిందని అర్థమైంది నిఖిల్‌కి.

దాంతో వాడి మనసులో ఉన్న సందేహాలన్నీ తీరిపోయాయి. తేలికగా అనిపించింది. ఇంటికి వెళ్లాక చిన్నాన్నని కలిసి జరిగిందంతా చెప్పాడు నిఖిల్.

అప్పుడు వాళ్ల చిన్నాన్న "ప్రతి సంఘటన జరగడం వెనక ఏదో ఒక కారణం ఉండి ఉంటుంది. ఎవ్వరూ నిన్ను ఇష్టపడకపోవడం కాదని ముందే చెప్పాను కదా. ఇప్పటికైనా ఒప్పుకుంటావా నీ ఆలోచన తప్పని. నీ ఆత్మన్యూనతా భావం వదిలిపెడతానని మాట ఇవ్వు" అని అడిగాడు.

నిఖిల్ ఆనందంగా తల ఊపాడు. "ఒక్కోసారి జరిగే సంఘటనలతో మన విలువను కొలవకూడదు. మనల్ని ఇష్టపడే వాళ్లు ఎప్పుడూ ఉంటారు. మనమే ముందుగా మనల్ని నమ్మాలి" అని తెలిసింది నిఖిల్‌కి.


– నారంశెట్టి ఉమామహేశ్వరరావు

కేంద్ర సాహిత్య అకాడమీ (బాల)పురస్కార గ్రహీత

పార్వతీపురం

m : 9490799203


శతకం


# వేమన పద్యాలు

**గొడ్డుటావు బితుక గుండcగొంపోయిన**
**పండ్లమాడc దన్ను బాల నిడదు**
**లోభివాని నడుగ లాభంబు లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : గొడ్డుటావును పితుకుటకై కుండ తీసుకుని వెళ్ళినా పాలు యివ్వదు సరికదా పండ్లు రాలునట్లు తన్నును. ఆ విధముగనే లోభివానిని అడిగినచో యేమియూ లభించదు.

**అన్ని దానములను నన్న దానమె గొప్ప**
**కన్న తల్లి కంటే ఘనము లేదు**
**ఎన్న గురుని కన్న నెక్కుడు లేదయా**
**విశ్వదాభిరామ వినురవేమ!**

తాత్పర్యం : అన్ని దానముల కంటే అన్నదానము గొప్పది. కన్నతల్లి కంటే మించినది లేదు. గురువు కంటే గొప్పది లేదు.





కథ

# పన్నెండు నెలలు

## శామ్యూల్ మార్షాక్



'సంవత్సరంలో ఎన్ని నెలలుంటాయో తెలుసా?'

'పన్నెండు'.

'వాటి పేర్లు తెలుసా?"

'జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రియల్, మే, జూన్, జులై, ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్'.

ఒక నెల పూర్తికాక ముందు, ఇంకో నెల మొదలవదు. అవి ఒకదాని వెనుక ఒకటి వస్తాయి. అవి ఎప్పటికీ కలవవు. కాని ఒక ఊరిలో ఓ చిన్న పాప, ఆ పన్నెండు నెలలను ఒకేసారి చూసిందని చెప్పుకుంటారు. ఆ కథ మీకిప్పుడు చెప్తాను వినండి.

అనగనగా ఒక ఊరిలో పిసినారి చెడ్డ మహిళ ఉండేది. ఆమె, తన సొంత కూతురు, సవతి కూతురితో కలిసి నివసించేది. సొంత కూతురిని ప్రేమగా చూసుకునేది. సవతి కూతురిని చీటికి మాటికి తిడుతూ రాచి రంపాన పెట్టేది. ఆమె సొంత కూతురు గారాబంగా, బద్ధకంగా పెరిగేది.

ఒకసారి జనవరి నెలలో, చలి కాలంలో, ఊరి ప్రజలంతా ఇళ్ళలో వెచ్చగా ఉన్నారు. చెడ్డదైన తల్లి, తన సవతి కూతురుతో ఇలా అంది.

"అడవిలోకి వెళ్ళి మంచుగడ్డలు బుట్టనిండా ఏరుకొనిరా. రేపు నీ చెల్లి పుట్టినరోజు. ఒకవేళ మంచుగడ్డలు దొరకలేదనుకో, ఇంటికి రావొద్దు. అడవిలోనే చావు."

సవతి కూతురు ఇది విని, కళ్ళనిండా నీళ్ళు పెట్టుకొని బాధపడింది. ఎందుకంటే మంచుగడ్డలు జనవరిలో దొరకవు. మార్చి నెలలో అయితే దొరుకుతాయి. ఇది ఖచ్చితంగా తన మీద కోపంతో చెప్పిన పని అని తెలిసినా, చేసేదేమీ లేక, బుట్ట చేతపట్టుకుని వడివడిగా అడవిలోకి బయలుదేరింది.

అసలే ఎముకలు కొరికే చలికాలం, చిమ్మచీకటి. ఆకాశంలో ఒక్క నక్షత్రం కూడా లేదు.

అడవిలో ఓ మూల నున్న చెట్టును ఆనుకుని నిలబడింది. ఒక్కసారిగా ఉన్నట్టుండి ఓ మెరుపు లాంటి వెలుగు కనిపించింది.

ఆ వెలుగు ఉన్న ప్రదేశానికి వెళ్ళింది.

అక్కడ చలిమంట ఉంది.

దాని చుట్టూ పన్నెండు మంది మనుషులున్నారు. వాళ్ళను చూసి ఆశ్చర్యపోయింది. వాళ్ళు చాలా అందంగా ఉన్నారు. ఖచ్చితంగా వేటగాళ్ళు కారు. వాళ్ళలో చిన్న పిల్లలు, మధ్యవయస్కులు, ముసలివాళ్ళు ఉన్నారు. ఒక ముసలాయన పాప వద్దకు వచ్చి, ఏం కావాలని అడిగాడు.

'మంచుగడ్డల' కోసం వచ్చానని చెప్పింది. వాళ్ళు నవ్వారు. "జనవరిలో మంచుగడ్డలు దొరకవు, మార్చిలో రా, అప్పుడు దొరుకుతాయి" అన్నారు.

పాప తన సవతితల్లి గురించి చెప్పింది. మంచుగడ్డలు లేకుండా ఇంటికి వెళ్తే, చావబాదుతుందని, తను మార్చి నెల వచ్చేవరకు ఈ అడవిలోనే ఎదురుచూస్తానని చెప్పి పాప ఏడ్చింది. వాళ్ళల్లో చిన్నపిల్లవాడు వాళ్ళ అన్న దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు, "అన్నయ్యా జనవరి! నేనో గంట ఇక్కడ ఉంటాను."

జనవరి ఇలా అన్నాడు "తమ్ముడూ మార్చి! నాకు అభ్యంతరం లేదు. కానీ, ఫిబ్రవరి రాకుండా మార్చి రాదు కదా" అన్నాడు.

పక్కనే ఉన్న ఫిబ్రవరి కూడా అందుకు ఒప్పుకున్నాడు.

ఆ ముగ్గురి సహకారంతో, అడవిలో ఆ రాత్రివేళ గంటసేపు మంచుగడ్డలు కురిశాయి. అది చూసి పాప ఆశ్చర్యంతో కేరింతలు కొట్టింది. తన బుట్టనిండా మంచు గడ్డలు నింపుకుంది. ఆ పన్నెండుమందికి 'ధన్యవాదాలు' తెలిపి, ఇంటికి బయలుదేరింది.

తల్లి, సవతి కూతురు తెచ్చిన మంచుగడ్డలను చూసి, తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. 'ఎలా తెచ్చావని?' గద్దించింది. పాప జరిగిన కథంతా చెప్పింది.

పన్నెండు నెలలు నీకు కావల్సింది కోరుకోమంటే, కేవలం మంచుగడ్డలు తెచ్చావా? అని హేళన చేసింది.

తల్లి సొంత కూతురు ఇలా అంది,

"అమ్మా! నేనైతే ఆపిల్, స్ట్రాబెర్రీ, పుట్టగొడుగులు.. ఇంకా బోల్డన్ని తెచ్చేదాన్ని. అవన్నీ అమ్మితే మనకు బోల్డంత డబ్బొచ్చేది" అంది.

తరువాతి రోజు రాత్రి తల్లి తన సొంత కూతురికి, బుట్ట ఇచ్చి అడవిలోకి పంపింది. ఆ పాప చలిమంట వద్దనున్న పన్నెండు మంది మనుషులను చూసింది. ఏమాత్రం గౌరవం లేకుండా వాళ్ళ మధ్యకు వెళ్ళి కూర్చుంది.

"ఏం కావాలి?" అని అడిగారు వాళ్ళు.

"మీరు మా అక్కకి నిన్న రాత్రి మంచుగడ్డలిచ్చారటగా, నాకు ఆపిల్లలు, స్ట్రాబెర్రీలు, పుట్టగొడుగులు మొదలైనవన్నీ ఇవ్వండి" ఆజ్ఞాపించింది.

వాళ్ళకు కోపం వచ్చి భీకరమైన మంచు తుఫాను



సృష్టించారు. చలి మంట ఆరిపోయింది.


పాప మంచులో కూరుకుపోయింది. సొంత కూతురిని వెతుక్కుంటూ వచ్చిన తల్లి కూడా మంచు తుఫానులో కూరుకుపోయింది.

ఊరిలోని సవతి కూతురు పెరిగి పెద్దదై, పిల్ల పాపలతో సుఖంగా జీవించింది. వాళ్ళ పెరటిలో రకరకాల పూలు, పండ్లు సంవత్సరం పొడవునా ఉంటాయి. ఎందుకంటే పన్నెండు నెలలను ఆ పాప ఒకేసారి కలుసుకుంది కదా! వాళ్ళిప్పుడు స్నేహితులు.

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 81792 73971
ఇంగ్లీష్ : 12 మంత్స్
రచయిత : శామ్యూల్ మార్షాక
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డియన్

కథ

# తిక్క కుదిరింది




సాయికి చెట్లు, చేమలు ప్రకృతి అంటే చాలా ఇష్టం. చదివేది తొమ్మిదవ తరగతి అయినప్పటికీ పర్యావరణ పరిరక్షణ కోసం పరితపిస్తుంటాడు. ఊరి చివర ఉన్న చెరువు ఒడ్డున తాటి చెట్ల నీడన కూర్చుని చెరువునే చూస్తున్నాడు. ఇంతలో అక్కడికి పరిగెత్తుతూ వచ్చాడు ఆర్య. "అరేయ్ సాయి ఏం చేస్తున్నావ్?" అన్నాడు ఆర్య.

"చెరువులో చిట్టి చిట్టి చేపలు చూడురా ఎంత బాగా ఈదుతున్నాయో! వాటిని చూస్తుంటే ముచ్చటేస్తుంది అన్నాడు" సాయి.

"అవునవును" అంటూనే పక్కనే ఉన్న గుండు గుండు రాళ్లను తీసుకొని చేపలు, కప్పల మీదికి విసరసాగాడు ఆర్య.

"అదేంట్రా? ఆర్యా!.. ఎందుకలా విసురుతున్నావ్ చేపలు, కప్పలకు దెబ్బ తగులుతుంది, చచ్చిపోయే ప్రమాదం ఉంది" అన్నాడు సాయి.

"ఏం కాదులేరా!" అంటూ ఆపకుండా అదేపనిగా రాళ్ళు విసురుతున్నాడు ఆర్య.

సాయికి చాలా కోపం వచ్చింది. కానీ ఆర్యతో గొడవ పెట్టుకుంటే అతడు ఎగబడి కొడతాడని సాయికి తెలుసు. "ప్లీజ్ రా.. ప్లీజ్ రా..." అని బతిమిలాడుతున్నాడు.

ఇంతలో చెరువులోనుంచి ఒక పెద్ద కప్ప "ఓ బాబు ఎందుకలా రాళ్ళు విసురుతున్నావ్? ఆపు! మాకు దెబ్బ తగులుతుంది" అన్నది.

సాయి, ఆర్య ఇద్దరు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అదేంటి కప్ప మాట్లాడుతుంది, అని ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటూ ఉండగా కప్ప అవును. "నేను మాట్లాడుతాను. నన్ను మా చెరువులో మాట్లాడే కప్ప అంటారు. ఇక విసిరింది చాలు, ఇక్కడ నుంచి వెళ్ళండి" అన్నది.

"సరే" అన్నాడు సాయి. ఆర్య మాత్రం వినలేదు. "నిన్ను పట్టుకుంటా.. నిన్ను పట్టుకుంటా.." అంటూ అదే పనిగా మరిన్ని రాళ్ళు విసరడం మొదలుపెట్టాడు. ఇక కప్ప చేసేది లేక "వీడు మూర్ఖుడు" అనుకుంటూ దొరక్కుండా పారిపోయింది. కాసేపటికి సాయి, ఆర్య చెరువు దగ్గర నుంచి వెళ్లిపోయారు.

ఇదిలా ఉండగా ఒకరోజు ఆర్య పక్క ఊరిలో తన పెద్దమ్మ ఇంటికి వెళ్లి తిరిగి ఊరికి వస్తుండగా బాగా చీకటి అయ్యింది.

చెరువుగట్టు వెంబడి నడుచుకుంటూ రావడం చెరువు గట్టున ఉన్న కప్ప గమనించింది.

వెంటనే కప్ప ఆర్య నడుస్తుండగా కాళ్ళ మీదకి జంపు చేయడం మొదలుపెట్టింది. మాట్లాడే కప్పని చూసిన మిగతా కప్పలు కూడా ఒకదాని వెంట ఒకటి ఆర్యను నడుస్తుంటే ఇబ్బంది పెట్టడం మొదలుపెట్టాయి. బాగా చీకటి, పైగా ఒక్కడు "వామ్మో! పాములన్నీ నన్ను చుట్టుముట్టినట్టు ఉన్నాయి" అనుకొని ఆర్య "అమ్మో! అయ్యో!" అని అరవడం మొదలు పెట్టాడు.

ఇంతలో మాట్లాడే కప్ప "తిక్క కుదిరిందా ఆర్య!" మేము అనుకుంటే నిన్ను ఇప్పటికిప్పుడే చెరువులో పడేయగలం. మా సహచర ప్రాణులను పిలిచి నిన్ను ఇంకా ఇంకా ఇబ్బందికి గురి చేయగలం. ఇంకోసారి అనవసరంగా మా జోలికి రావద్దు. హాయిగా చెరువుగట్టున కూర్చుని ప్రశాంతంగా గాలి పీల్చక మా జీవుల మీదకు రాళ్ళు విసురుతావా?" అని గట్టిగా అరిచింది.

"క్షమించు కప్ప! ఇంకెప్పుడూ అలా చేయను నన్ను వదిలేయండి" అంటూ ఆర్య పరుగో! పరుగు!

– చిలుకూరి హరి నందన
బి.ఈ. రెండవ సంవత్సరం
m : 8919569089

సామెతల కథలు - 4

# వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకున్నట్టు



మనిషి గొప్ప చదువులు చదవ వచ్చు. ఉన్నత శిఖరాలకు చేర వచ్చు. ధనంతో ఎంతో ఎత్తుకు ఎదగవచ్చు. అంగ బలం, అధికార బలంలో ఆకాశాన్ని తాక వచ్చు. కాని, సమయం తనకు ప్రతికూలంగా మారినపుడు మంచితనంతో మన కన్నా తక్కువ స్థాయి వారికి కూడా గౌరవం ఇచ్చి మన పనులు చక్కబెట్టు కోవాలి. అలా కాకుండా నేను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అనుకో కూడదు. అహాన్ని, అధికారాన్ని చూపి పనులు చక్క బెట్టు కోవాలనుకుంటే అపజయాన్ని చవిచూడాలి.

ఒక్కోసారి అనుకోని సంఘటనలతో దారులన్నీ మూసుకు పోతాయి. అశక్తులుగా మారిపోతాం. అలాంటపుడు సమయస్ఫూర్తితో పనులు చక్కబెట్టు కోవాలి. అలాంటి సందర్భాలలో మానవాళికి చక్కని హితబోధ చేసే ఈ సామెత వెలుగులోకి వచ్చింది. దేవకి అష్టమ గర్భంలో జన్మించే శిశువు చేతిలో కంసుడి మరణం ఉంది. ఆ విషయం కంసుడు ఆకాశవాణి ద్వారా తెలుసుకున్నాడు. అందుకే దేవకి, వసుదేవులను చెరసాలలో బంధించాడు. కానీ, శ్రీమహావిష్ణువు యోగ మాయ ప్రభావంతో కృష్ణుడిగా జన్మించాడు. కృష్ణుని రేపల్లెకు తరలించడానికి పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నాయి. వసుదేవుడు పసివాడైన కృష్ణుడిని తీసుకుని బయలు దేరాడు. కానీ, చెరసాల బయట ఒక గాడిద ఉంది. అది ఎక్కడ ఓండ్ర పెడుతుందో. తన ప్రయత్నానికి ఆటంకం కలిగిస్తుందో అని వసుదేవుడు భయపడ్డాడు. అందుకే తన పని సానుకూలంగా జరగడానికి వసుదేవుడు గాడిద కాళ్లు పట్టుకొని ప్రార్థించాడు. తమ పనులను విజయ వంతంగా పూర్తి చేసుకోవడానికి ఎలాంటి వారైనా కొన్ని కొన్ని సమయాలలో పరిస్థితులకు తలొగ్గి పనులు సానుకూలం చేసుకోవాలి. అలాంటి సందర్భంలో వాడే సామెత ఇది.

– 'బాల కథా సౌరభం' నుండి...

చరిత్ర పాఠాలు-16

# ఇక్ష్వాకుల సంస్కృతి

నాగార్జునకొండలో మత, లౌకిక (రెండు రకాల) కట్టడాలు కన్పిస్తున్నాయి. అక్కడ ప్రాకారాలు, అగడ్త, కోటలో భవనాలు, రాజప్రాసాదం, ప్రేక్షాగారం (బహిరంగ ప్రదర్శనశాల) తవ్వకాల్లో బయటపడ్డాయి. బహిరంగ ప్రదర్శనశాల నిర్మాణంలో రోమన్ వాస్తుశిల్పుల పాత్ర ఉన్నట్లు అర్థమవుతుంది. అక్కడే కూర్మకుండం, అవబృథ స్నానవాటికతో పాటు అశ్వమేథ వేదిక కూడా బయటపడ్డాయి. నాగార్జునకొండ మీదనే బహుశా ఎహువల ఛాంతమూలుని కాలం నుండి నిర్మించబడిన కార్తికేయ, పుష్పభద్ర, హారీతి, అష్టభుజస్వామి, కుబేరస్వామి, మహాసేన, శక్తి, నవగ్రహాల విగ్రహాలు, ఆలయ శిల్ప శిథిలాలు బయటపడ్డాయి. నాటి ఆలయాలు ఆగమశాస్త్రాల ప్రకారం గర్భగుడి, అంతరాళం, మంటపం, ధ్వజస్థంభం, ప్రాకారాలతో సహా నిర్మించబడ్డాయి. అయితే హిందూ శిల్ప సంప్రదాయం శాతవాహన కాలంనాటిదే.



కొణిదెన, పెద్దముడియం శిల్పఫలకాలు, చేజెర్ల సప్తమాతృకల విగ్రహాలు, వీరాపురం దేవాలయాలు ఇక్ష్వాకులు నిర్మించినవే. శ్రీపర్వతంతో పాటు సూర్యాపేట జిల్లాలోని ఫణిగిరి, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట, రామిరెడ్డిపల్లి, చినగంజాంలలో కూడా నాటి స్థూపాలు, విహారాలు, మంటపాలు దర్శన మిస్తున్నాయి. ఫణిగిరిలో సాంచి తోరణాల వంటి శిలా శిల్ప శకలాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్, సంగారెడ్డి రహదారికి పక్కనున్న కంది గ్రామంలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ పురావస్తు శాఖ 1983-84 సంవత్సరంలో జరిపిన తవ్వకాలలో ఇక్ష్వాకుల కాలపు నివాస స్థావరంలో అష్టకోణాకృత (ఎనిమిది పలకల) గర్భాలయం, దాని ముందు దీర్ఘ చతురస్రాకార మహా మండపం వెలుగు చూశాయి. ఇక్కడి ఇటుకలకు నాగార్జున కొండలోని సర్వదేవాధివాసంలో వాడిన ఇటుకలకు పోలికలుండడంతో ఈ ఆలయం కూడా అదే ఇక్ష్వాకుల కాలపు అష్టభుజ స్వామి ఆలయం అయ్యుంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ కంది ఆలయం భారతదేశంలో ద్రావిడ శైలికి చెందిన తొలి దేవాలయం అని ఈమని శివనాగిరెడ్డి స్థపతి భావించారు.




### భాషా - సాహిత్యాలు

ఎహువల ఛాంతమూలుని కాలం నుండి శాసనాలను సంస్కృత భాషలో (నాగార్జున కొండలో) రాయడం ప్రారంభమైంది. నాటి శిల్పం ఎంత అందంగా ఉందో బ్రాహ్మీలిపి కూడా అంత అందంగా ఉంది. ఎహువల, అనిక్కి, బాపి, అడవి, రెమ్మణక మొదలయిన తెలుగు పదాలు నాటి తెలుగు భాషా ప్రాధాన్యాన్ని తెలుపుతాయి.

నాగార్జునకొండ, ధాన్యకటకం నాటి ప్రధాన విద్యా కేంద్రాలు. ఇవి దేశవిదేశాల నుండి విద్యార్థులను ఆకర్షించేవి. వీటిల్లో మత, లౌకిక విద్యలు రెండింటిని బోధించే వారు.

మహాయాన బౌద్ధానికి పేరొందిన శ్రీపర్వతం బౌద్ధుల గ్రంథ రచనకు కూడా నెలవైంది. నాగార్జునకొండ శాసనాన్ని బట్టి అభిరకులు (శకులు) ఎహువల ఛాంతమూలుని పాలనలో ఒక దశాబ్దకాలం అంతరాయం కల్గించారని తెలుస్తున్నది. మైదవోలు, మంచికల్లు శాసనాలు పల్లవుల మొదటి రాజు సింహవర్మ ఇక్ష్వాకు వంశపాలనను అంతం చేశాడని సూచిస్తున్నాయి.

- డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078




# కలంచెలిమి



**జె. శ్రావణి**
8వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల మత్‌మల్,
యెల్లారెడ్డి, కామారెడ్డి.



**సిహెచ్. సిద్ధార్థ్**
7వ తరగతి,
షైన్ హై స్కూల్
హనుమకొండ.

**సత్యాల పెంచల ప్రసన్న**
9వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
చిలకలమర్రి, అనంతసాగరం,
నెల్లూరు.



**పి. రోహిత్**
9వ తరగతి,
జడ్.పి.హెచ్.ఎస్ (బాలురు),
దౌల్తాబాద్, సిద్ధిపేట.





**అవాల ప్రత్యూష**
6వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
శ్రీరామనగర్, గరివిడి,
విజయనగరం.



**టి. సాయిమణి**
7వ తరగతి, జడ్.పి.హెచ్.ఎస్,
నర్సిపురం, పార్వతీపురం, మన్యం.

కథ

# హెల్మెట్



రామేశంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న నవ్య ప్రతిరోజు నడుచుకుంటు బడికి వెళ్లేది. ఒక రోజు లారీ వేగంగా వచ్చి బైక్ మీద వెళ్తున్న వారిని ఢీకొట్టింది. బండి ఎగిరి కిందపడిపోయింది. బండి మీదున్న ఇద్దరి తలలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది కళ్లార చూసిన నవ్య చాలా బాధపడింది. బడికి వెళ్లిన తరువాత తన స్నేహితులతో చెప్పి, ఏ విధంగానైన సరే ఇలాంటి సంఘటన మళ్లీ జరగకుండా ఉండడానికి బైక్ మీద ప్రయాణించే ప్రతి ఒక్కరు విధిగా "హెల్మెట్" ధరించాలని, ప్రాణాలు కాపాడుకోవాలని ఉపాధ్యాయుల సహకారంతో ప్రజలను చైతన్యవంతులను చేయాలని నిర్ణయించుకున్నారు.

రామేశంపల్లిలో మరుసటి రోజు నుండి నవ్య తన స్నేహితులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ 'హెల్మెట్' ఆవశ్యకతను తెలిపారు. అంతే గాకుండా హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్రమాదవశాత్తు బైక్ మీద నుండి కింద పడిన హెల్మెట్ మన ప్రాణాలను కాపాడుతుందని, నిండు జీవితం మిగులుతుందని చక్కగా వివరించారు. ఒక నిండు ప్రాణం తమ కుటుంబానికి ఎంతో బాసటగా నిలుస్తుందని పాటల రూపంలో వివరించారు. వివిధ పత్రికల్లోని ప్రమాదాలను సంబంధించిన చార్టుల మీద అతికించి ప్రదర్శించారు. రవాణ శాఖవారు అందించిన స్టిక్కర్లు గోడలకంటిచారు.

హెల్మెట్ ముందున్న వారే కాదు, వెనుక ఉన్నవారు కూడా ధరించాలని తమకు చాలా చక్కగా 'హెల్మెట్' ప్రాధాన్యతను వివరించిన నవ్యను మెచ్చుకున్నారు. తన స్నేహితులతో కలిసి గ్రామంలో ప్రతి ఒక్కరిని చైతన్య పరిచినందుకు అభినందించారు. నవ్య ఆమె స్నేహితులు చేసిన మంచి పనికి వారిని పోలీస్ వారు, రవాణా శాఖ వారు సన్మానించారు. 'బాలవాక్కు – బ్రహ్మవాక్కు'ని పిల్లలు చేసిన పని చాలా గొప్పదని మెచ్చుకున్నారు.

**(బాలచెలిమి జాతీయ పోటీ కథలు-2025 : 'పిల్లలు రాసిన పిల్లల కథలు-1'లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కథ)**

– డి. స్నీతిక

7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
రాంపూర్, నిజాంపేట, మెదక్.
m: 94417 62105

## సామెతలు

- అడవి పంది చేను మేసిపోతే, ఊరపంది చెవులు కోసినట్లు.
- ఆ ఊరికి ఈ వూరు ఎంత దూరమో, ఈ వూరికి ఆ వూరు అంతే దూరం.
- ఇచ్చేవాడు తీసుకునే వాడికి లోకువ.
- ఉప్పు లేదు, కారమూ లేదు, అమ్మతోడు కమ్మగుంది.
- ఎత్తేవాడుంటే ఏకుల బుట్టా బరువే.
- ఏతాము పాటకు ఎదురు పాట లేదు.
- ఒకరిదైతే ఓపినంత, తనదైతే తగరమంత.
- కంటికి రెప్ప, కాలికి చెప్పు.
- గతి చెడినా మతి చెడరాదు.
- చింత చచ్చినా పులుపు చావలేదు.

– బాలచెలిమి డెస్క్

# కోరుకున్న వరుస రెండు సంఖ్యలు

1. ఏవైనా రెండు వరుస సంఖ్యలను కూడమని చెప్పాలి.
2. ఆ జవాబును 5తో గుణించమని చెప్పాలి.
3. 5తో గుణించగా వచ్చిన జవాబును మీకు చెప్పమనాలి.
4. అది విని వారు రాసుకున్న వరుస రెండు సంఖ్యలేవో మీరు చెప్పాలి.

ఉదా: 15+16=31, 31×5=155
43+44-87, 87×5=435
89+90=179, 179×5=895

155 అని చెప్పగానే 15, 16 అని చెప్పాలి.
435 అని చెప్పగానే 43,44 అని చెప్పాలి.
895 అని చెప్పగానే 89,90 అని చెప్పాలి.

**రహస్యం:** జవాబులోని ఒకట్ల స్థానం ఖచ్చితంగా 5 ఉంటుంది. దాని ముందు సంఖ్య మొదటి సంఖ్య అవుతుంది. దానికి 1 కలిపితే రెండవ సంఖ్య వస్తుంది.

## BEAUTY NUMBER

142857 x 1,2,----6

142857 x 1 = 142857
142857 x 2 = 285714
142857 x 3 = 428571
142857 x 4 = 571428
142857 x 5 = 714285
142857 x 6 = 857142

- అంకెల మామయ్య చంద్రయ్య
m: 9440926937



# చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------
తండ్రి పేరు : ------------------
పుట్టినతేదీ : ------------------
చిరునామా : ------------------
------------------
------------------
పిన్ : ------------------
హాబీలు : ------------------
మొబైల్ : ------------------
ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk. chelimi@gmail. com



# వేగం, సమర్థత, తెలివితేటలకు ప్రతీక ఏఐ ఏజెంట్స్




కృత్రిమ మేధస్సు ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో "ఏఐ ఏజెంట్స్" సాంకేతిక రంగంలో అత్యంత ప్రాధాన్యం పొందుతున్న ఆధునిక వ్యవస్థలుగా నిలుస్తున్నాయి. ఇవి సాధారణ కంప్యూటర్ ప్రోగ్రామ్‌ల మాదిరిగా కేవలం నిర్దిష్ట ఆదేశాలను అమలు చేయడమే కాకుండా, పరిసరాలను గమనించి, సమాచారాన్ని విశ్లేషించి, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని పనులను నిర్వహించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందువల్ల భవిష్యత్తు డిజిటల్ ప్రపంచ నిర్మాణంలో ఏఐ ఏజెంట్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఏఐ ఏజెంట్ అనేది తెలివైన సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యవస్థ. ఇది వివిధ వనరుల నుంచి సమాచారాన్ని సేకరించి, దానిని విశ్లేషించి, నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన చర్యలను అమలు చేస్తుంది. సాధారణ చాట్‌బాట్స్‌తో పోలిస్తే ఏఐ ఏజెంట్స్ మరింత స్వతంత్రంగా పని చేయగలవు. ఉదాహరణకు ఇవి ఇమెయిల్స్‌ను చదవడం, సమావేశాల షెడ్యూల్ రూపొందించడం, ఇంటర్నెట్‌లో సమాచారాన్ని సేకరించడం, నివేదికలను సిద్ధం చేయడం, రిమైండర్లు పంపడం వంటి పలు కార్యకలాపాలను నిర్వహించగలవు. ఈ కారణంగా ఇవి వ్యక్తిగత మరియు వృత్తిపరమైన డిజిటల్ సహాయకులుగా విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి.

ఏఐ ఏజెంట్స్ భావన 1950లలో ప్రారంభమైన కృత్రిమ మేధస్సు పరిశోధనల నుంచి రూపుదిద్దుకుంది. అలన్ ట్యూరింగ్, జాన్ మెకార్తీ వంటి ప్రముఖ శాస్త్రవేత్తలు యంత్రాలు కూడా మానవుల మాదిరిగా ఆలోచించగలవనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 1970–1980 దశకాలలో అభివృద్ధి చెందిన "ఎక్స్‌పర్ట్ సిస్టమ్స్" నియమాల ఆధారంగా నిర్ణయాలు తీసుకునే ప్రాథమిక ఏఐ వ్యవస్థలుగా నిలిచాయి. ముఖ్యంగా వైద్య రంగంలో రోగ నిర్ధారణకు వీటి వినియోగం ప్రారంభమైంది. 1990లలో ఇంటర్నెట్ విస్తరణతో ఇంటెలిజెంట్ సాఫ్ట్‌వేర్ ఏజెంట్స్ అభివృద్ధి చెందాయి. సెర్చ్ అసిస్టెంట్లు, ఆన్‌లైన్ బాట్స్ వంటి వ్యవస్థలు వినియోగదారులకు సేవలు అందించడం ప్రారంభించాయి. 2000ల తర్వాత స్మార్ట్ ఆటోమేషన్ అభివృద్ధి చెందడంతో కస్టమర్ సేవలు, ఈ-కామర్స్, స్మార్ట్ పరికరాలు వంటి రంగాల్లో ఏఐ వినియోగం విస్తరించింది. 2020 తర్వాత జనరేటివ్ ఏఐ మరియు శక్తివంతమైన భాషా నమూనాల ఆవిర్భావంతో ఏఐ ఏజెంట్స్ మరింత ఆధునిక రూపాన్ని సంతరించుకున్నాయి. ప్రస్తుతం ఇవి ప్రణాళికలు రూపొందించడం, కోడింగ్ చేయడం, పరిశోధనలు నిర్వహించడం వంటి క్లిష్టమైన పనులను కూడా సమర్థంగా నిర్వహిస్తున్నాయి. ఏఐ ఏజెంట్స్ అభివృద్ధి వెనుక ప్రధాన ఉద్దేశ్యం మానవ పని భారాన్ని తగ్గించడం మరియు సమర్థతను పెంచడం. పునరావృత పనులను స్వయంచాలకంగా నిర్వహించడం, వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం, విస్తృత సమాచారాన్ని విశ్లేషించడం, సమయాన్ని ఆదా చేయడం వంటి అవసరాల కారణంగా ఇవి విస్తృత ఆదరణ పొందుతున్నాయి. ఆధునిక డిజిటల్ యుగంలో ఖచ్చితత్వం, వేగం, సమర్థతకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనేక సంస్థలు ఏఐ ఏజెంట్స్‌ను తమ కార్యకలాపాల్లో వినియోగిస్తున్నాయి.

ఏఐ ఏజెంట్స్ పని విధానం కూడా అత్యంత సాంకేతికతతో కూడుకున్నది. మొదట ఇవి టెక్స్ట్, చిత్రాలు, సెన్సర్లు, వెబ్‌సైట్లు, డేటాబేస్‌లు వంటి వనరుల నుంచి సమాచారాన్ని సేకరిస్తాయి. అనంతరం మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, సహజ భాషా ప్రాసెసింగ్ వంటి సాంకేతికతల సహాయంతో ఆ సమాచారాన్ని విశ్లేషిస్తాయి. తదుపరి దశలో అవసరమైన చర్యలను నిర్ణయించి, వాటిని అమలు చేస్తాయి. ఉదాహరణకు ఇమెయిల్స్ పంపడం, నివేదికలు సిద్ధం చేయడం, పరికరాలను నియంత్రించడం, ఆన్‌లైన్‌లో సమాచారాన్ని వెతకడం వంటి పనులను నిర్వహిస్తాయి. అనుభవం ద్వారా

నేర్చుకునే సామర్థ్యం వీటిని మరింత సమర్థవంతమైన వ్యవస్థలుగా మారుస్తుంది. ఏఐ ఏజెంట్స్ అనేక రకాలుగా అభివృద్ధి చెందాయి. కొన్ని ప్రస్తుత పరిస్థితులకు మాత్రమే స్పందించే సింపుల్ రిఫ్లెక్స్ ఏజెంట్స్ కాగా, మరికొన్ని గత సమాచారాన్ని ఉపయోగించే మోడల్ ఆధారిత ఏజెంట్స్‌గా పనిచేస్తాయి. లక్ష్యాన్ని చేరేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేసే గోల్-బేస్డ్ ఏజెంట్స్, అనుభవం ద్వారా నేర్చుకునే లెర్నింగ్ ఏజెంట్స్ కూడా విస్తృతంగా వినియోగంలో ఉన్నాయి. పూర్తిగా స్వతంత్రంగా పని చేసే ఆటోనమస్ ఏజెంట్స్ ప్రస్తుతం అత్యాధునిక రూపంగా పరిగణించబడుతున్నాయి. సెల్ఫ్ డ్రైవింగ్ వాహనాలు, స్మార్ట్ రోబోట్స్, డెలివరీ వ్యవస్థలు వీటి ఉదాహరణలు. ప్రస్తుతం విద్య, ఆరోగ్యం, బ్యాంకింగ్, ఈ-కామర్స్, పరిశ్రమలు, రవాణా, సైబర్ భద్రత వంటి అనేక రంగాల్లో ఏఐ ఏజెంట్స్ విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. విద్యారంగంలో వ్యక్తిగత బోధన, ఆరోగ్యరంగంలో రోగుల పర్యవేక్షణ, బ్యాంకింగ్‌లో మోసాల గుర్తింపు, ఈ-కామర్స్‌లో వినియోగదారుల అభిరుచులకు అనుగుణమైన సూచనలు, పరిశ్రమల్లో స్మార్ట్ తయారీ వ్యవస్థలు, రవాణాలో ట్రాఫిక్ నిర్వహణ వంటి రంగాల్లో వీటి సేవలు కీలకంగా మారాయి.

ఏఐ ఏజెంట్స్ వల్ల పనుల ఆటోమేషన్, వేగవంతమైన నిర్ణయాలు, నిరంతర సేవలు, మానవ శ్రమ తగ్గింపు, ఉత్పాదకత పెరుగుదల వంటి అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయి. అయితే గోప్యత సమస్యలు, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం, సాంకేతికతపై అధిక ఆధారపడటం, అధిక డేటా మరియు కంప్యూటింగ్ శక్తి అవసరం వంటి సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. భవిష్యత్తులో ఏఐ ఏజెంట్స్ మరింత స్వతంత్రంగా, తెలివిగా అభివృద్ధి చెందనున్నాయి. భావోద్వేగాలను అర్థం చేసుకుని మానవులతో సహకార పూర్వకంగా పనిచేసే స్థాయికి ఇవి చేరుకునే అవకాశం ఉంది. విద్య, ఆరోగ్యం, స్మార్ట్ నగరాలు, అంతరిక్ష పరిశోధన, పరిశ్రమల ఆటోమేషన్ వంటి రంగాల్లో వీటి వినియోగం మరింత విస్తరించనుంది. ఈ నేపథ్యంలో ఏఐ ఏజెంట్స్ ఆధునిక ప్రపంచాన్ని రూపుదిద్దుతున్న అత్యంత ప్రభావవంతమైన సాంకేతిక విప్లవాలలో ఒకటిగా నిలుస్తున్నాయి.

- లత
e: ogshydcbse@gmail. com



# మా స్నేహం

ఎగిసిపడే సాగర కెరటమా,
వికసించే ప్రేమ పుష్పమా,
వినిపించే జీవన సరిగమా,
మా హృదయాలలో నిండిన అనంత స్నేహమా,

నయనానందకర నెమలి నృత్యమా,
ఉల్లాసపు గీతికై పలికే కోయిల రాగమా!
చల్లనైన వెన్నెల అందమా,
శాశ్వతమైన మన స్నేహానికి అనుబంధమా!

గలగల పారే జీవన గోదారి వలె
కల్మషం లేని మన స్నేహానికి స్ఫూర్తి రహదారి
ప్రతి మది కలల లోగిలికి చేర్చే,
ఓ పవిత్రమైన, సువర్ణ కాంతిదారి!

- సిహెచ్. అక్షయ
9వ తరగతి, తెలంగాణ మోడల్ స్కూల్
ఘన్‌పూర్ (స్టే), జనగామ.

# కోతులు మిణుగురు పురుగులు



ఒక గాఢమైన అడవిలో కోతుల గుంపు నివసించేది. ఆ అడవిలో పెద్ద పెద్ద చెట్లు, పక్షుల కిలకిలారావాలు, జంతువుల సందడి ఉండేది. ఒక రోజు సాయంత్రం నుండి గాలి బాగా చల్లబడింది. రాత్రి అయ్యే సరికి చలి మరింత పెరిగింది. కోతులు వణుకుతూ ఒకచోట చేరాయి.

“ఇలా ఉంటే మనం చలిని తట్టుకోలేం. మంట వెలిగించాలి,” అని ఒక కోతి చెప్పింది. అన్ని కోతులు అంగీకరించాయి. కానీ వాటికి మంట ఎలా వెలిగించాలో తెలియదు. అంతలో కొంచెం దూరంలో చిన్న చిన్న వెలుగులు కనిపించాయి. అవి చీకటిలో మెరిసిపోతూ చాలా అందంగా కనిపించాయి. ఒక కోతి ఆనందంగా అరిచింది:

“చూడండి! మంట కణాలు ఉన్నాయి. వాటిని తీసుకువచ్చి మంట పెడదాం!” అన్ని కోతులు పరుగెత్తి వెళ్లి ఆ వెలుగులను పట్టుకుని తీసుకొచ్చాయి. అవి నిజానికి మిణుగురు పురుగులు. కానీ కోతులకు అది తెలియదు. అవి ఆ పురుగులను ఒకచోట పోగు చేసి, వాటిపై ఊదుతూ మంట వెలిగించాలని ప్రయత్నించాయి.

అప్పుడే ఒక చిన్న పిట్ట అక్కడికి వచ్చి చూసింది. అది కోతుల పని చూసి నవ్వింది.

“అయ్యో! మీరు ఏమి చేస్తున్నారు? అవి మంట కణాలు కావు. అవి మిణుగురు పురుగులు. వాటితో మంట రాదు,” అని చెప్పింది.

కానీ కోతులు కోపంగా చూసాయి

“నువ్వు మాకు బుద్ధి చెప్పాలా? మేమే తెలివైన వాళ్లం!” అని పిట్టను దూరం పంపించాయి.

కోతులు మళ్లీ మళ్లీ ప్రయత్నించాయి. అవి గట్టిగా ఊదాయి, పొగ వస్తుందేమో అని ఆశపడ్డాయి. కానీ మంట మాత్రం రాలేదు. కొంతసేపటికి అవి అలసిపోయాయి. చలి మాత్రం ఇంకా పెరిగింది.

చివరికి కోతులు తమ తప్పు గ్రహించాయి.

“ఆ పిట్ట చెప్పింది నిజమే. మేము వినకపోవడం వల్ల ఇంత కష్టపడ్డాం,” అని అవి విచారించాయి.

### కథలో సైన్స్ తెలుసుకొందామా?

**1. మిణుగురు పురుగులు ఎందుకు వెలుతురు ఇస్తాయి?**

మిణుగురు పురుగులు (Fireflies) వెలుగుతుండటం ఒక అద్భుతమైన ప్రకృతి సంఘటన. దీనిని జీవ కాంతి (Bioluminescence) అంటారు.

మిణుగురు పురుగుల శరీరంలో ఒక ప్రత్యేక రసాయన ప్రక్రియ జరుగుతుంది. వాటి పొట్ట భాగంలో: a) లూసిఫెరిన్ (Luciferin) అనే పదార్థం b) లూసిఫెరేజ్ (Luciferase) అనే ఎంజైమ్, ఆక్సిజన్‌తో చర్య పొంది ఒక రసాయన చర్య జరుగుతుంది. ఆ చర్యలో శక్తి వెలుతురు రూపంలో

బయటకు వస్తుంది. అందుకే అవి మెరుస్తూ కనిపిస్తాయి.

మిణుగురు పురుగులు ఇలా వెలుగుటకు కొన్ని ముఖ్యమైన కారణాలు కూడా ఉన్నాయి a) జతను ఆకర్షించడానికి (Mating signal): ఆడ, మగ పురుగులు ఒకరినొకరు గుర్తించడానికి ప్రత్యేకమైన వెలుగులు ఇస్తాయి. b)రక్షణ కోసం (Protection): ఈ వెలుగు ఇతర జంతువులకు “నేను రుచికరమైన ఆహారం కాదు” అనే సంకేతం ఇస్తుంది. c) సంప్రదింపులు (Communication): కొన్ని సందర్భాల్లో అవి ఒకరితో ఒకరు సమాచారం పంచుకోవడానికి కూడా వెలుగుతాయి.



### 2. మిణుగురు పురుగుల వెలుతురును చల్లటి వెలుగు (cold light) అని ఎందుకు అంటారు

సాధారణ బల్బు వెలిగినప్పుడు ఉపయోగించే శక్తిలో సుమారు 90% వేడి రూపంలో నష్టపోతుంది, కేవలం 10% మాత్రమే వెలుతురుగా మారుతుంది. కానీ మిణుగురు పురుగుల్లో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. వీటిలో దాదాపు 90–95% శక్తి నేరుగా వెలుతురుగా మారుతుంది, చాలా తక్కువ శక్తి మాత్రమే వేడి రూపంలో ఉంటుంది. అందువల్ల మిణుగురు పురుగుల వెలుతురు అత్యంత సమర్థవంతమైన (efficient) మరియు “చల్లని వెలుతురు”గా పరిగణించబడుతుంది.


### 3. మంట అంటే ఏమిటి?

మంట ఏర్పడటానికి మూడు ముఖ్యమైన అంశాలు అవసరం, వాటిని కలిపి “మంట త్రికోణం (Fire Triangle)” అంటారు. అవి ఇంధనం (fuel), ఆక్సిజన్ (oxygen), మరియు వేడి (heat). కాగితం, చెక్క, గ్యాస్ వంటి ఇంధన పదార్థాలను వేడి చేస్తే, అవి ఒక నిర్దిష్ట ఉష్ణోగ్రత (ignition temperature)కి చేరిన తర్వాత గాలిలో ఉన్న ఆక్సిజన్‌తో రసాయన చర్య (combustion) ప్రారంభమవుతుంది. ఈ చర్యలో శక్తి విడుదలై, అది వేడి మరియు వెలుతురు రూపంలో బయటకు వస్తుంది, దానినే మనం మంటగా చూస్తాం. ఈ మూడు అంశాలలో ఏదైనా ఒకటి లేకపోతే మంట ఏర్పడదు. కాబట్టి మంట అనేది ఇంధనం, ఆక్సిజన్, మరియు వేడి కలిసి పనిచేసే ఒక రసాయన ప్రక్రియ.

### 4. మంట వల్ల చలి ఎందుకు తగ్గుతుంది?

మంట వల్ల చలి తగ్గడానికి ప్రధాన కారణం అది విడుదల చేసే వేడి (heat energy). మంట ఏర్పడినప్పుడు జరిగే రసాయన చర్యలో (combustion) ఎక్కువ శక్తి ఉత్పత్తి అవుతుంది. ఈ శక్తి వేడి రూపంలో చుట్టూ ఉన్న గాలికి వ్యాపిస్తుంది. వేడి గాలి పైకి ఎగసిపోతూ, చల్లని గాలిని కూడా వేడిగా మారుస్తుంది. మన శరీరం చలిలో వేడిని కోల్పోతుంది, కానీ మంట దగ్గర నిలబడితే ఆ వేడి మన శరీరానికి చేరి శరీర ఉష్ణోగ్రతను పెంచుతుంది. అందువల్ల మనకు చలి తగ్గినట్లు అనిపిస్తుంది. కాబట్టి మంట విడుదల చేసే వేడి శక్తి వల్ల చలి తగ్గుతుంది.

– కె శ్రీకృష్ణ సాయి
రేవతి సైన్స్ ఫౌండేషన్ (రామచంద్రపురం)
m : 9866130320




# పులిట్జర్ బహుమతులు - 2026

Pulitzer Prize ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన జర్నలిజం, సాహిత్యం, సంగీత రంగ పురస్కారాలలో ఒకటి. అమెరికాలోని Columbia University ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ బహుమతులను ప్రదానం చేస్తారు. 2026 అవార్డులు ముఖ్యంగాప్రజా సమస్యలు, యుద్ధ ప్రభావాలు, ప్రకృతి విపత్తులు, సామాజిక అన్యాయాలపై వెలుగునిచ్చిన కథనాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. ఈ బహుమతులను హంగేరీ మూలాలు కలిగిన ప్రసిద్ధ పత్రికా వ్యాపారవేత్త జోసెఫ్ పులిట్జర్ స్మారకార్థం ప్రారంభించారు. జర్నలిజం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆయన తన ఆస్తిలో కొంత భాగాన్ని ఈ అవార్డుల కోసం కేటాయించారు.

| జర్నలిజం విభాగం | విజేతలు | అంశం |
|---|---|---|
| ప్రజా సేవ | ది వాషింగ్టన్ పోస్ట్ | ట్రంప్ ప్రభుత్వంలోని ఫెడరల్ సంస్థల పునర్వ్యవస్థీకరణపై విశ్లేషణాత్మక కథనాలు |
| బ్రేకింగ్ న్యూస్ రిపోర్టింగ్ | ది మిన్నెసోటా స్టార్ ట్రిబ్యూన్ సిబ్బంది | కాథలిక్ పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటనపై సమగ్రత, మానవీయతతో కూడిన కథనాలను అందించినందుకు. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలు మరణించగా, 28 మంది గాయపడ్డారు. |
| ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ | ది న్యూయార్క్ టైమ్స్ సిబ్బంది | అధ్యక్షుడు ట్రంప్ ప్రయోజనాల ఘర్షణల నియంత్రణలను ఎలా ధ్వంసం చేసి, అధికారంతో వచ్చే ఆర్థిక అవకాశాలను తన కుటుంబం మరియు మిత్రులకు లాభదాయకంగా మార్చారో వెలికితీసిన కథనాల కోసం. |
| వివరణాత్మక రిపోర్టింగ్ | సుసీ నీల్సన్, మేగన్ ఫాన్ మున్స్, సారా డి నటాలే | "బర్న్" శ్రేణి కోసం. అగ్నిప్రమాదాల్లో ఇళ్లు కోల్పోయిన కాలిఫోర్నియా ప్రజలకు బీమా సంస్థలు అల్గోరిథమిక్ సాధనాల ద్వారా తక్కువ విలువ కట్టడం, క్లెయిమ్‌లను తిరస్కరించడం, పునర్నిర్మాణాన్ని అసాధ్యం చేయడం వంటి అంశాలను బయటపెట్టినందుకు. |
| బీట్ రిపోర్టింగ్ | జెఫ్ హోర్విట్జ్, ఎంగెన్ థామ్ (రాయిటర్స్) | మెటా సంస్థలో మోసపూరిత ప్రకటనలు, కృత్రిమ మేధ దుర్వినియోగంపై పరిశోధన |
| స్థానిక రిపోర్టింగ్ | డేవ్ ఆల్టిమారి, జీన్నీ మోంక్ మరియు ప్రోపబ్లికాకు చెందిన సోఫీ చౌ, హారు కోరైన్ (ది కనెక్టికట్ మిర్రర్) చికాగో ట్రిబ్యూన్ | వలసదారులపై దాడుల నేపథ్యంలో చికాగో ప్రజల ప్రతిస్పందనపై కవరేజ్ |
| జాతీయ రిపోర్టింగ్ | రాయిటర్స్ సిబ్బంది | నెడ్ పార్కర్, లిండా సో, పీటర్ ఐజ్లర్, మైక్ స్పెక్టర్ – అధ్యక్షుడు అమెరికా ప్రభుత్వాన్ని మరియు తన మద్దతుదారుల ప్రభావాన్ని కార్యనిర్వాహక అధికారాన్ని విస్తరించేందుకు, శత్రువులపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఎలా ఉపయోగించారో పత్రబద్ధం చేసినందుకు. |
| అంతర్జాతీయ రిపోర్టింగ్ | అసోసియేటెడ్ ప్రెస్ | ప్రపంచవ్యాప్తంగా నిఘా వ్యవస్థలపై విశ్లేషణాత్మక పరిశోధన |
| ఫీచర్ రచన | టెక్సాస్ మంత్లీ యొక్క ఆరన్ పార్సీ | సెంట్రల్ టెక్సాస్ వరదల్లో తన కుటుంబం ఎదుర్కొన్న నష్టం, మేనల్లుడు మరణం గురించి హృదయవిదారక వ్యక్తిగత కథనం రాసినందుకు. |
| విమర్శాత్మక రచన | మార్క్ లామ్‌స్టర్ (ది డల్లాస్ మార్నింగ్ న్యూస్) | వాస్తు నిర్మాణాలపై లోతైన విమర్శాత్మక వ్యాసాలు |

| | | |
|---|---|---|
| అభిప్రాయ రచన | ఎం. గెస్సెన్ (ది న్యూయార్క్ టైమ్స్) | నియంతృత్వ రాజకీయాలపై వ్యాసాలు |
| చిత్రాలతో కూడిన రిపోర్టింగ్ మరియు వ్యాఖ్యానం | ఆనంద్ ఆర్‌కే, సుపర్ణ శర్మ, నటాలి ఒబికో పియర్సన్ | "ట్రాప్‌డ్" కథనం కోసం. భారతదేశంలో ఒక న్యూరాలజిస్టు "డిజిటల్ అరెస్ట్"లో చిక్కుకున్న ఘటన ద్వారా డిజిటల్ మోసాలు, నిఘాపై వెలుగునిచ్చినందుకు. |
| బ్రేకింగ్ న్యూస్ ఫోటోగ్రఫీ | సహెర్ అల్‌ఘోరా (ది న్యూయార్క్ టైమ్స్) | గాజాలో యుద్ధం వల్ల ఏర్పడిన విధ్వంసం, ఆకలిని చూపిన సున్నితమైన ఫోటో శ్రేణి. |
| ఫీచర్ ఫోటోగ్రఫీ | జాహీ చిక్వెండియు (ది వాషింగ్టన్ పోస్ట్) | క్యాన్సర్‌తో మరణంతో పోరాడుతున్న తండ్రి సమక్షంలో తమ తొలి శిశువుకు జన్మనిచ్చిన కుటుంబ జీవన ప్రయాణాన్ని హృదయ విదారకంగా ఆవిష్కరించిన ఫోటో వ్యాసానికి. |
| ఆడియో రిపోర్టింగ్ | పాబ్లో టోరే ఫైండ్స్ అవుట్ సిబ్బంది | ఎన్‌బీఏలోని లాస్ ఏంజెల్స్ క్లిప్పర్స్ జట్టు జీత పరిమితి నియమాలను ఎలా ఉల్లంఘించిందో ప్రత్యక్ష పోడ్‌కాస్ట్ జర్నలిజం ద్వారా విశ్లేషణాత్మకంగా వెలుగులోకి తీసుకువచ్చినందుకు. |
| కల్పిత సాహిత్యం | డేనియల్ క్రాస్ | "ఏంజెల్ డౌన్" నవలకు పురస్కారం |
| నాటక రచన | బెస్ వోల్ | "లిబరేషన్" నాటకానికి అవార్డు |

– బాలచెలిమి డెస్క్

# కళలకు ప్రోత్సాహమే సంస్కృతి అభివృద్ధికి మూలం - బి. నరసింగ్ రావు



తేదీ: 25-04-2026, హైదరాబాద్‌లోని లమకాన్ వేదికగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బాల ప్రతిభాశాలి రిక్కీ తేజ్ రూపొందించిన "చార్కోల్ స్టోరీస్" చిత్ర ప్రదర్శన ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ సినీ దర్శకుడు, చిత్రకారుడు బి. నర్సింగ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిక్కీ తేజ్‌లోని అసాధారణ కళా ప్రతిభను ప్రశంసించారు. ముఖ్యంగా పౌరాణిక అంశాల ఆధారంగా రూపొందించిన బొగ్గు రేఖా చిత్రాలు భావవ్యక్తీకరణ, సహజత్వంతో ఆకట్టుకున్నాయని అన్నారు. భవిష్యత్తులో అతను మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విద్యతో పాటు సంగీతం, నృత్యం, మట్టి కళలు, క్రీడలు వంటి సృజనాత్మక కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు.

తెలంగాణ కళల పుట్టినిల్లుగా నిలిచిందని పేర్కొంటూ, పిల్లలకు స్వేచ్ఛగా తమ సృజనాత్మకతను వ్యక్తపరచుకునే అవకాశాలు కల్పిస్తేనే వారు కళల్లో రాణిస్తారని తెలిపారు. "కళలు వికసిస్తే సంస్కృతి వికసిస్తుంది" అని ఉద్ఘాటిస్తూ, కళలను సృష్టించడం మాత్రమే కాక వాటిని ఆస్వాదించడం కూడా ఒక గొప్ప సాధనమని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు వెంకటేశ్వరరావు, సంపాదకీయ వ్యంగ్యచిత్రకారుడు నర్సిం, గ్రూప్-1 అధికారిణి సాహితి, ప్రధానోపాధ్యాయులు వేముల సైదులు తదితరులు పాల్గొని రిక్కీ తేజ్ ప్రతిభను అభినందించారు. బాలచెలిమి బాలల పత్రిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు కళా, సాహిత్య వర్గాల నుంచి విశేష స్పందన లభించింది.

– బాలచెలిమి డెస్క్




# గోల్డ్ మెడల్

"ఒరేయ్ చింటూ! ఇలా రారా! మీ నాన్న గణితంలో గోల్డ్ మెడలిస్ట్ కదా.నువ్వు కూడ మీనాన్నలా ముందు ముందు గోల్డ్ మెడల్ సాధించాలి... అవునా... ఇప్పుడు నీకో లెక్కల ప్రశ్న వేస్తున్నా.. జవాబు చెప్పాలి" అన్నాడు ఇంటర్ చదువుతున్న అరవింద్, రెండో తరగతి చదువుతున్న చింటూని.

"అలాగే.. అడుగు" అన్నాడు చింటూ.

"అదిగో.. అలా చూడు. ఆ వస్తున్న గొర్రెల మందలో ఎన్ని గొర్రెలున్నాయో చెప్పు." అన్నాడు అరవింద్. ఉదయం మేతకు అడవికి వెళ్ళిన గొర్రెలు సంధ్య వేళకు ఇంటికి తిరిగి వస్తున్నాయి. అరవింద్ అడిగిన వెంటనే చింటూ హఠాత్తుగా వంగి తలను నేలను ఆనించి కొద్ది క్షణాల్లోనే లేచి కుడి చేతిని గాల్లో అటు ఇటు ఆడించి నూటా అరవై రెండు అని అన్నాడు.

చింటూ, ఊపిరి పీల్చుకుంటూ. టక్కున గొర్రెల కాపరి మల్లన్న దగ్గరికి వెళ్లి ఎన్ని గొర్రెలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నాడు అరవింద్.

చింటూ చెప్పిన జవాబే చెప్పాడు మల్లన్న. ఆశ్చర్యపోయిన అరవింద్ "అంత కరెక్ట్‌గా ఎలా చెప్పావురా" అన్నాడు.

"వెరీ సింపుల్. ముందుగా కిందికి వంగి వాటి కాళ్ళను లెక్కించి తర్వాత నాలుగు చే భాగించాను, అంతే... అన్నాడు చింటూ తాపీగా. నోరెళ్ళ పెట్టాడు అరవింద్. ఇంటర్లో తాను జీకేలో గెలుచుకున్న పార్కర్ పెన్నుని చింటూకి బహుకరించాడు అరవింద్.

– బిక్కనూరి రాజేశ్వర్
టీచర్, 5-5-27/2, గాంధీనగర్ కాలనీ, నిర్మల్-504106
m : 9959951995

# అడవుల అసలైన వారసులు

# బోర్నియో మహావానరాలు



ప్రపంచంలోని అత్యంత అరుదైన మరియు మేధస్సు కలిగిన మహావానర జాతులలో ఒకటి. “పోంగో పిగ్మేయస్” అనే శాస్త్రీయ నామంతో పిలువబడే ఈ జీవులు ప్రధానంగా బోర్నియో ద్వీపంలోని ఉష్ణమండల వర్షారణ్యాలలో నివసిస్తాయి. ప్రశాంత స్వభావం, కుటుంబ బంధాలను గౌరవించే జీవన విధానం కారణంగా ఇవి ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపును సంపాదించాయి. మానవులను పోలిన అనేక లక్షణాలు వీటిలో కనిపించడం శాస్త్రవేత్తలను కూడా ఆశ్చర్యానికి గురిచేస్తోంది. బోర్నియో మహావానరాలు సాధారణంగా ఒంటరిగా జీవించడాన్ని ఇష్టపడతాయి. అయితే తల్లి మరియు పిల్లల మధ్య బలమైన అనుబంధం ఉంటుంది. తల్లి తన పిల్లలను సుమారు ఏడు నుండి ఎనిమిది సంవత్సరాల వరకు సంరక్షిస్తుంది. ఇది జంతు ప్రపంచంలోనే అత్యంత దీర్ఘకాలిక తల్లి సంరక్షణలలో ఒకటిగా గుర్తించబడింది. చెట్లపై జీవించడానికి అనుకూలంగా వీటి చేతులు పొడవుగా మరియు బలంగా ఉంటాయి. ఎక్కువ సమయం చెట్లపైనే గడుపుతూ పండ్లు, ఆకులు, చెట్ల తొక్కలు, చిన్న మొక్కలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి. అడవులలో విత్తనాల వ్యాప్తికి ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అందువల్ల వీటిని “అరణ్యాల సహజ విత్తన రక్షకులు” అని కూడా పిలుస్తారు. బోర్నియో మహావానరాలు రూపంలో సుమత్రా మహావానరాల కంటే భిన్నంగా కనిపిస్తాయి. వీటి ముఖం వెడల్పుగా ఉండటంతో పాటు గడ్డం కొద్దిగా చిన్నగా ఉంటుంది. శరీరం ముదురు గోధుమ రంగు వెంట్రుకలతో కప్పబడి ఉంటుంది. మగ జీవులు ఆడ జీవులకంటే పెద్దవిగా ఉంటాయి. వీటి బరువు సుమారు ముప్పై నుండి వంద కిలోల వరకు ఉండగా, ఎత్తు సుమారు ఒక మీటరు నుండి ఒకటిన్నర మీటర్ల వరకు పెరుగుతుంది. International Union for Conservation of Nature (IUCN) ప్రకారం బోర్నియో మహావానరాలు “తీవ్ర ప్రమాదంలో ఉన్న జాతి”గా గుర్తించబడ్డాయి. గత అరవై సంవత్సరాలలో వీటి జనాభా యాభై శాతం కంటే ఎక్కువగా తగ్గిపోయింది. అదేవిధంగా గత ఇరవై సంవత్సరాలలో వీటి సహజ నివాస ప్రాంతాలు కనీసం యాభై ఐదు శాతం వరకు క్షీణించాయి. అడవుల నరికివేత, గనుల తవ్వకాలు, వ్యవసాయ విస్తరణ మరియు అక్రమ వేట ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు ఒక లక్ష నాలుగు వేల జీవులు మాత్రమే మిగిలి ఉన్నట్లు అంచనా. ఈ జాతిలో మూడు ప్రధాన ఉపజాతులు గుర్తించబడ్డాయి. వాయువ్య ప్రాంత మహావానరాలు అత్యంత ప్రమాదంలో ఉన్న ఉపజాతిగా గుర్తించబడ్డాయి. ప్రస్తుతం వీటి సంఖ్య చాలా తక్కువగా మిగిలింది. ఈశాన్య ప్రాంత మహావానరాలు పరిమాణంలో చిన్నవిగా ఉంటాయి. మధ్య బోర్నియో మహావానరాలు సంఖ్యలో అధికంగా ఉన్నప్పటికీ అడవుల నాశనం కొనసాగితే వీటికీ ప్రమాదం పెరిగే అవకాశముంది.

ఆడ మహావానరాలు సాధారణంగా పదిహేనేళ్ల తర్వాత సంతానోత్పత్తి ప్రారంభిస్తాయి. ఒకసారి గర్భం దాల్చిన తర్వాత ఎనిమిది నుండి తొమ్మిది నెలల తరువాత ఒక పిల్లకు జన్మనిస్తాయి. ఒక ఆడ జీవి ఎనిమిది నుండి పది సంవత్సరాలకు ఒక్కసారి మాత్రమే పిల్లను కనడం వల్ల జననాల రేటు చాలా తక్కువగా ఉంటుంది. సహజ వాతావరణంలో ఇవి ముప్పై ఐదు నుండి నలభై ఐదు సంవత్సరాల వరకు జీవిస్తాయి. అడవులు తగ్గిపోవడంతో ఆహారం కోసం గ్రామాల వైపు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో మానవులు మరియు అడవి జీవుల మధ్య ఘర్షణలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు అక్రమ రవాణాకు గురవడం ఈ జాతి భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన అనేక దేశాలు మరియు పర్యావరణ సంస్థలు సంరక్షణ కార్యక్రమాలను ప్రారంభించాయి. అడవులను సంరక్షిత ప్రాంతాలుగా ప్రకటించడం, అక్రమ వేటపై కఠిన చర్యలు తీసుకోవడం, అనాథ పిల్లలను రక్షించి తిరిగి అడవుల్లో విడిచిపెట్టడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రజల భాగస్వామ్యం కూడా సంరక్షణలో చాలా అవసరం. పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం ద్వారా మాత్రమే ఈ అరుదైన మహావానరాలను భవిష్యత్తు తరాలకు కాపాడగలుగుతాము.

– సచిన్ కోత్వాల్
m : 97010 01036



కథ

# తనదాకా వస్తే...



"పక్కింటి వాళ్ళు మోటారు వేసి మరచిపోయినట్టు ఉన్నారు. వాటర్ ట్యాంక్ నుండి నీరు వృధాగా బయటకు పోతుంది. ఒకసారి వెళ్ళి చెబుతాను" అంటూ చదువుతున్న పుస్తకాల మధ్య నుండి లేవబోయాడు పదేళ్ళ సిద్ధూ. "ఆగు, అదేమో మన ఇంట్లో నీరు కాదు. నువ్వు చేయబోయే సమాజసేవ చాలు, వాళ్ళకి కరెంటు బిల్లు ఎక్కువ వస్తే తిక్క కుదురుతుంది" అంటూ అడ్డుతగిలింది తల్లి సరోజ. ఇలా నాలుగైదు సార్లు జరిగినా సిద్ధూని వారించే ప్రయత్నం జరిగేది. సిద్ధూ బాధపడుతూ మౌనంగా ఉండిపోయేవాడు. రోజులు గడుస్తున్నాయి వేసవికాలం వచ్చింది. ఇప్పుడు సిద్ధూ వాళ్ళ ఇంటిలోనే నీటికొరత వచ్చింది. బోరింగు నుండి నీరు కొద్ది కొద్దిగా రావడం ఆగిపోవడంతో సరోజకు నీటి కష్టాలు మొదలయ్యాయి. దూరభారం వెళ్ళి ఇంటి అవసరాలకు నీరు తెచ్చుకొనే సరికి సరోజిని తల ప్రాణం తోకకు వస్తుండేది. అసహనం పెరిగి ఇంటిలో ఒక్క చుక్క నీరు వృధా చేసిన ఒంటికాలుతో లేచి ఇంటి వాళ్ళని కసురుకుంటుండేది.

ఇది గమనించిన సిద్ధు "అమ్మా! మా మాష్టారు చెప్పినట్టు బాధ పడితే గాని బోధపడదనేది నిజమనిపిస్తుంది" చెప్పాడు.

"ఇప్పుడెందుకు ఆ విషయం?" అడిగింది తల్లి.

"పొరుగింటి బోరునీరు వృధాగా పోతున్న ప్రతీసారీ నన్ను నిలువరించిన తప్పుకి ఇప్పుడు మనం అనుభవిస్తున్న శిక్ష గురించి" చెప్పాడు సిద్ధూ.

"దానికి, దీనికి ఏమి సంబంధం?" అడిగింది తల్లి.

"భూగర్భ జలాలు అందరివి. వాటిని అనుభవించే హక్కు అందరికీ ఎంత ఉందో, వాటిని సంరక్షించవలసిన బాధ్యత కూడా అంతే ఉంటుంది. ప్రతిరోజూ వృధా నీటిని చూస్తు మనకెందుకని ఊరుకున్నాం. నేలలో ఉన్న నీటి వనరులు బయటకు పోవడంతో వర్షాలు కురవని వేసవిలో భూమిలోకి నీరు చేరే మార్గాలు లేక నీటి ఎద్దడి కనిపిస్తుంది" రుజువు చూపించాడు సిద్ధూ.

"సహజవనరుల వృధాను అడ్డుకోకపోతే ఇటువంటి అనర్థాలు ఎదురవుతాయన్న సత్యం తెలుసుకున్నాను. నాకెందుకు అనే స్వార్థం విడిచిపెట్టి నప్పుడే అందరం బాగుంటాం. అందులో మనము ఉంటాము" అంది సరోజ. అప్పటి నుండి ఇరుగుపొరుగు ఇళ్ళల్లో వృధాగా నీరు పోయే సందర్భంలో తానే ముందు కదిలి వారికి నీటి ఆవశ్యకతను తెలియజేస్తుండేది సరోజ.

– బెహరా మోక్షజ

10వ తరగతి, పార్వతీపురం

m : 9440980950

**పదాల మేడ సమాధానాలు (పేజి 20):**

**అడ్డం :** 1) అబ్దుల్ కలాం, 2) లబ్ధి, 3) అదృష్టం, 5) వెన్నుపోటు, 7) ఆటంకం, 10) లోభి.

**నిలువు :** 1) అలవాటు, 3) అభిమన్యుడు, 4) పోరాటం, 6) వెన్న, 8) రేపు, 9) కష్టం, 11) జున్ను

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ
హైదరాబాద్ (Regd. 720/1982)
బాలచెలిమి గ్రంథాలయం

# బాల చెలిమి గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక పఠనోత్సవం





**జిల్లా పరిషత్ ఉన్నత ఉన్నత పాఠశాల, అనంతసాగర్ (సిద్దిపేట జిల్లా)...**

ప్రపంచ పుస్తక దినోత్సవం (23 ఏప్రిల్ 2026) సందర్భంగా సిద్దిపేట జిల్లా అనంతసాగర్ ఉన్నత పాఠశాలలో బాల చెలిమి గ్రంథాలయం ఆధ్వర్యంలో పఠనోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, వారు చదివిన పుస్తకాలపై సమీక్షలు రాసి తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. అత్యుత్తమ సమీక్షలు వ్రాసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

నేను కథలు వ్రాసి బహుమతులు గెలుచుకోవడానికి బాల చెలిమి గ్రంథాలయం ఎంతో ఉపయోగపడింది. వారానికి మూడు సార్లు గ్రంథాలయానికి వస్తాను అని తెలిపింది.

– **బొజ్జ అఖిల,** విద్యార్థిని. 8వ తరగతి

ఇక్కడ కథల పుస్తకాలతో పాటు విజ్ఞానం అందించే పుస్తకాలు కూడా ఉన్నాయి. రచయితగా ఎదగడానికి ఈ గ్రంథాలయం నాకు ప్రేరణనిచ్చింది.

– **బి. విశ్వ తేజ,** విద్యార్థి, 7వ తరగతి

విద్యార్థుల్లో పఠనాభిరుచి పెంపొందించడంలో గ్రంథాలయాల పాత్ర ఎంతో కీలకం. మా పాఠశాలలో విద్యార్థులు కవులు, కథకులుగా ఎదగడానికి బాల చెలిమి గ్రంథాలయం ఒక కారణం.

– **కోణం పర్శరాములు,** తెలుగు ఉపాధ్యాయులు

మా విద్యార్థుల ఉన్నతి కోసం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసిన వేదకుమార్ సర్ గారికి పాఠశాల తరపున కృతజ్ఞతలు.

– **కోట జ్యోతి,** ప్రధానోపాధ్యాయురాలు

– **భైతి దుర్గయ్య,** ఉపాధ్యాయులు

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు, బీబీపేట (కామారెడ్డి జిల్లా)...**

కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు బీబీపేటలో జనవరి 20న "బాలచెలిమి గ్రంథాలయం"ను బీబీపేట గ్రామ సర్పంచ్ శ్రీమతి సాద్విక గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమం విద్యార్థులలో పఠనాసక్తి, సృజనాత్మకత మరియు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే ఒక మంచి ప్రయత్నంగా నిలిచింది. బాలచెలిమి మాసపత్రిక వారి ఆధ్వర్యంలో పాఠశాలకు ఉచితంగా సుమారు ఏడు వేల రూపాయల విలువైన 108 పుస్తకాలను అందజేశారు. ఈ పుస్తకాలలో కథలు, విజ్ఞాన సర్వస్వాలు, జీవిత చరిత్రలు, నైతిక విలువలను పెంపొందించే రచనలు ఉన్నాయి. ఈ గ్రంథాలయం ద్వారా విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం పుస్తక పఠనానికి కేటాయిస్తూ తమ జ్ఞానాన్ని విస్తరించుకునే అవకాశం పొందుతున్నారు.

"బాలచెలిమి గ్రంథాలయం" విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా కథలు, కవితలు, వ్యాసాలు వంటి సృజనాత్మక రచనలు చేయడానికి ప్రేరణనిస్తుంది. గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయి. బాల్యం ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత ముఖ్యమైన దశ. ఈ దశలో మంచి పుస్తకాల పరిచయం కలిగితే వారి భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుంది. పుస్తకాలు మనకు మంచి స్నేహితులుగా మారి విజ్ఞానం, నైతిక విలువలు మరియు ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయి. "చదువు – ఎదుగు – ముందుకు సాగు" అనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ బాలచెలిమి గ్రంథాలయం విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

– **ఎల్. రామేశ్వర్ రెడ్డి**
జిహెచ్ఎం. జెడ్‌పిహెచ్ఎస్ గర్ల్స్, బీబీపేట

## తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో బాల సాహిత్య వేడుక




బాల సాహిత్యమే భావి సాహిత్యమనే భావనతో తెలంగాణ సారస్వత పరిషత్తు బాల సాహిత్య సమ్మేళనానికి శ్రీకారం చుట్టడం మంచి పరిణామమని వక్తలు అన్నారు. శాంతా-వసంతా ట్రస్టు సౌజన్యంతో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 24 ఏప్రిల్ సోమవారం బాల సాహిత్య సమ్మేళనం ఘనంగా జరిగింది. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి, పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె. చెన్నయ్య పాల్గొన్నారు. ఈ సమ్మేళనంలో బాల సాహితీవేత్తలు డాక్టర్ దాసరి వెంకటరమణ, చొక్కాపు వెంకటరమణ, వేదాంత సూరి, గరిపెల్లి అశోక్, పత్తిపాక మోహన్, రింగు రామ్మూర్తి పాల్గొన్నారు. రచనా కళ, పిల్లల కథల ఆరో సంపుటిని వక్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాల సాహిత్యంలో విశేషంగా కృషి చేస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన రచయితలు, ఉపాధ్యాయులకు బాల సాహితీమూర్తి, బాల సాహితీ మిత్ర పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. బాల సాహితీ మూర్తి పురస్కారానికి డాక్టర్ వీఆర్. శర్మ (కామారెడ్డి), యు. విజయశేఖర్‌రెడ్డి (హైదరాబాద్), ఎడ్ల లక్ష్మి (సిద్దిపేట), ముంజులూరి కృష్ణకుమారి (విజయవాడ), జొన్నలగడ్డ శ్యామల (హైదరాబాద్), ఓట్ర ప్రకాశ్‌రావు (తిరుత్తణి-తమిళనాడు), డాక్టర్ కొప్పవరపు నారాయణమూర్తి (విశాఖపట్టణం), డాక్టర్ గౌరవ రాజు సతీష్‌కుమార్ (మెదక్), ఎస్. హనుమంతరావు (విశాఖపట్టణం) అందుకున్నారు. బాల సాహితీ మిత్ర పురస్కారాలకు ఈ. రాఘవేంద్ర (అనంతపురం), డాక్టర్ చిట్యాల దేవేంద్రప్ప (నంద్యాల), బైతీ దుర్గయ్య (సిద్దిపేట), కోకిల నాగరాజు (నిజామాబాద్), ఉండ్రాళ్ల రాజేశం (మెదక్), డాక్టర్ నెమిలేటి కిట్టన్న (తిరుపతి), గుండ్ల రాజు (సిద్దిపేట), పెరుమాళ్ల ఆనంద్, డాక్టర్ పొట్టబత్తుల రామకృష్ణ (నల్గొండ), పసుపులేటి నీలిమ (కర్నూలు), సబ్బతి సుమిత్రాదేవి (కొత్తగూడెం) అందుకున్నారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ. 5 వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరించారు.

## యువ ఆవిష్కర్తలుగా ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు




హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌కు చెందిన ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ విద్యార్థులు దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్ఠాత్మక "స్టాక్‌హోమ్ జూనియర్ వాటర్ ప్రైజ్ ఇండియా 3.0" పోటీలో భారతదేశంలోని టాప్-25 జట్లలో స్థానం సంపాదించి పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారు. 2026 మే 8న చెన్నైలోని ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి సదస్సులో విద్యార్థులు తమ వినూత్న ఆవిష్కరణలను ప్రముఖ శాస్త్రవేత్తలు, నిపుణులు మరియు న్యాయనిర్ణేతల సమక్షంలో ప్రదర్శించారు.

ఐఐటీ మద్రాస్ మరియు ఆక్వా మ్యాప్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీ, దేశంలోని యువ ఆవిష్కర్తలకు నీటి సమస్యలకు సుస్థిర పరిష్కారాలను అందించే వేదికగా నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థులు "VORTEX" మరియు "PANGEA" అనే రెండు వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు. పరిశ్రమలలో నీటి వినియోగాన్ని తగ్గించే సాంకేతికతతో రూపొందించిన "VORTEX", అలాగే వరదనీటి నిర్వహణ, భూగర్భజలాల పునరుద్ధరణకు కృత్రిమ మేధస్సు ఆధారంగా రూపుదిద్దుకున్న "PANGEA" ప్రాజెక్టులు విశేష ప్రశంసలు అందుకున్నాయి.

ఈ ప్రాజెక్టులను విద్యార్థులు ఆయుష్ తులసి ఏతకోట, పరమకుశం ప్రిన్స్ రోహన్ రూపొందించగా, ఎన్.ఎస్. లత మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థుల ప్రతిభ, శాస్త్రీయ దృక్పథం, జాతీయ స్థాయిలో చేసిన ప్రతినిధిత్వం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలియజేసింది.

– బాలచెలిమి డెస్క్

# చెట్ల నీడలో చిరస్మరణీయుడైన
# వనజీవి రామయ్య

దరిపల్లి రామయ్య, ప్రజల్లో "చెట్ల రామయ్య" లేదా "వనజీవి రామయ్య"గా ప్రసిద్ధి పొందిన మహనీయుడు, ప్రకృతి పరిరక్షణ కోసం తన జీవితాన్నంతా అంకితం చేసిన గొప్ప సామాజిక సేవకుడు. చెట్ల పెంపకం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని సంకల్పించి తన జీవితకాలమంతా నిరంతరంగా కృషి చేశారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన, అసాధారణమైన సంకల్పంతో కోట్లాది మందికి ఆదర్శంగా నిలిచారు.

వనజీవి రామయ్య 1937 జూలై 1న అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా రెడ్డిపల్లి గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే ప్రకృతిపట్ల ఆయనకు అపారమైన ప్రేమ ఉండేది. గ్రామీణ వాతావరణంలో పెరిగిన ఆయన చెట్ల విలువను చాలా దగ్గరగా అర్థం చేసుకున్నారు. ఆయన విద్యాభ్యాసం పదో తరగతి వరకు మాత్రమే కొనసాగినా, విత్తనాల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పుస్తకాలను చదివి తన జ్ఞానాన్ని పెంపొందించుకున్నారు.



చిన్నతనంలో తన తల్లి కూరగాయల విత్తనాలను భద్రపరచడం చూసి ఆయనకు విత్తనాల ప్రాముఖ్యత తెలిసింది. అప్పటి నుంచే విత్తనాలను సేకరించడం ఆయన అలవాటుగా మారింది. గంధం, మర్రి, రావి, బిల్వం, కదంబం వంటి అనేక దేశీయ చెట్ల విత్తనాలను సేకరించి ఖాళీ ప్రదేశాల్లో నాటడం ప్రారంభించారు. ప్రతి నిర్జన భూమిని పచ్చదనంతో నింపాలన్నదే ఆయన ప్రధాన ఆశయం. రామయ్య ఐదు దశాబ్దాలకు పైగా సామాజిక అటవీ ఉద్యమాన్ని కొనసాగించారు. ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాల్లో లక్షకు పైగా మొక్కలు నాటి పచ్చని వాతావరణాన్ని సృష్టించారు. ఆయన నాటిన చెట్లలో నీడనిచ్చే చెట్లు, పండ్ల మొక్కలు, జీవ ఇంధన మొక్కలు ఎక్కువగా ఉండేవి.

తన సైకిల్‌పై మొక్కలు, విత్తనాలు తీసుకుని గ్రామాలు, రహదారుల పక్కలు, కొండప్రాంతాలు, పాఠశాలల వద్ద మొక్కలు నాటేవారు. కొన్నిసార్లు ఆయన భార్య, స్థానిక విద్యార్థులు కూడా ఆయనతో కలిసి పాల్గొనేవారు. వర్షాకాలం వచ్చినప్పుడు ఎక్కువగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. మొక్కలు నాటడమే కాదు, అవి పెద్ద చెట్లుగా పెరిగే వరకు కాపాడటం కూడా తన బాధ్యతగా భావించేవారు.

ప్రకృతిని కాపాడటం అంటే మానవాళిని కాపాడటమే అని ఆయన గట్టిగా నమ్మేవారు. "ప్రకృతిని రక్షించండి – భవిష్యత్తును రక్షించండి" అనే సందేశాన్ని ఎప్పుడూ ప్రజల్లో ప్రచారం చేసేవారు. "భూమిపై నివసించే జీవరాశులలో మానవుడు అత్యున్నతమైనవాడు. అందుకే ప్రకృతిని సంరక్షించడం ప్రతి మనిషి బాధ్యత" అని ఆయన తరచూ చెప్పేవారు. చెట్ల కొరత వల్ల వర్షాభావం, కాలుష్యం, ఉష్ణోగ్రతల పెరుగుదల వంటి సమస్యలు వస్తాయని ప్రజలకు వివరించేవారు. మొక్కలు కొనుగోలు చేయడానికి, విత్తనాలు సేకరించడానికి తన సొంత మూడు ఎకరాల భూమిని కూడా అమ్మేశారు. ప్రకృతి కోసం వ్యక్తిగత ఆస్తులను త్యాగం చేయడంలో ఆయన వెనుకడుగు వేయలేదు. ఆయన జీవితం పూర్తిగా పర్యావరణ సేవకే అంకితమైంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి ప్రత్యేక సత్కారాలు అందించింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం చేపట్టిన "హరితహారం" కార్యక్రమానికి ఆయన మద్దతుగా నిలిచారు. రాష్ట్రంలోని పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో సాగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రజలకు ప్రేరణగా మారారు. గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు మొక్కలు నాటాలని ప్రోత్సహించారు.

వనజీవి రామయ్య అనేక పురస్కారాలను అందుకున్నారు. 1995లో సేవా పురస్కారం, 2005లో వనమిత్ర పురస్కారం, 2015లో జాతీయ సంప్రదాయ జ్ఞాన పురస్కారం ఆయనకు లభించాయి. పర్యావరణ పరిరక్షణలో చేసిన విశిష్ట సేవలకు గాను భారత ప్రభుత్వం 2017లో దేశంలోని అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన "పద్మశ్రీ" పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ గౌరవం ఆయన సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపును తీసుకు వచ్చింది.

2025 ఏప్రిల్ 12న గుండె సంబంధిత సమస్యల కారణంగా ఆయన మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 87 సంవత్సరాలు. కానీ ఆయన నాటిన చెట్లు, ఆయన ఇచ్చిన సందేశం, ఆయన చూపిన మార్గం ఎప్పటికీ నిలిచిపోతాయి. ప్రకృతిని ప్రేమించాలి, చెట్లను కాపాడాలి, భవిష్యత్తు తరాలకు పచ్చని ప్రపంచాన్ని అందించాలి అనే గొప్ప సందేశాన్ని ఆయన జీవితం మనకు నేర్పుతుంది. వనజీవి రామయ్య చేసిన సేవలు భారత పర్యావరణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

– సువేగా

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186,Behind SBH(H.O)
Gunfoundry,Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- SCHOOL BOOKS
- GENERAL BOOKS
- STATIONARY & GIFTS






Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

**BALA CHELIMI,** Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026



# బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక
## ప్రచురణలు



**46 పుస్తకాల ధర రూ.2320 • తగ్గింపు ధర రూ. 2100**

### తెలంగాణ బడి పిల్లల కథలు
10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)
10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు
18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ**
హైదరాబాద్ (Regd. 720/1982)

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

**ప్రతులకు**
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88

email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY

Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com